కొత్త ఎమ్మెల్యేల తొలి ప్రాధాన్యం



అభివృద్ధికి తిలోదకాలిచ్చిన వైసీపీని ఓట్ల ఉప్పెన ఊడ్చేసింది. తెలుగుదేశం కూటమికి తిరుగులేని అధికారం ఇచ్చింది. అరాచకాన్ని, విధ్వంసాన్ని సహించని జనం అభివృద్ధి కోసమే ఈ తీర్పునిచ్చారు. దెబ్బతిన్న రోడ్లు, మరమ్మతులకు నోచుకోని చెరువులు, మురికి కూపాలుగా మారిన పట్టణాలు, సాగు, తాగు నీటి పై నిర్లక్ష్యం.. జిల్లాలో ఎటుచూసినా దయనీయ వాతావరణం కనిపిస్తోంది. అప్పులకుప్పగా మార్చి అప్పగించిన రాష్ట్రంలో ప్రతిదీ చక్కదిద్దుకోవడం అంత సులభమేమీ కాదు. ఎన్నికల ప్రచారాల్లో హామీలు ఇచ్చి గెలిచిన శాసనసభ్యులకు అభివృద్ధే పెద్ద సవాలు. శ్రద్ధ, లౌక్యం, ప్రణాళికాబద్ధమైన ప్రాధాన్యాలతో ప్రతి అడుగూ వేయాలి. అన్ని పనులూ ఏకకాలంలో అసాధ్యం. అందుకే కొత్త ఎమ్మెల్యేల తొలిప్రాధాన్యాలు ఏమిటో తెలుసుకునే ప్రయత్నం ఆంధ్రజ్యోతి చేసింది. అభివృద్ధి ఆకాంక్షలతో ఎదురుచూస్తున్న ప్రజలకు వాటిని అందిస్తున్నాం... - తిరుపతి,ఆంధ్రజ్యోతి

గూడూరు

తిరిగి నెల్లూరు జిల్లాలోకి


పాశం సునీల్ కుమార్

గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలపడమే ముఖ్య అజెండాగా పెట్టుకున్నా. సీఎం చంద్రబాబు కూడా దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా జిల్లాలను విభజించి గూడూరు ప్రజలకు తీరని వేదన మిగిల్చింది. ప్రస్తుత జిల్లా కేంద్రమైన తిరుపతికి వెళ్ళాలంటే వంద కిలోమీటర్లు ప్రయాణించాలి. అదే నెల్లూరు అయితే 35 కిలోమీటర్ల చేరువలో వుంది. దీనికోసం గట్టిగా కృషి చేసి త్వరలోనే గూడూరు ప్రజలకు శుభవార్త వినిపించేందుకు ప్రయత్నిస్తున్నా.

సత్యవేడు

రోడ్లు బాగు చేస్తా


కోనేటి ఆదిమూలం

సత్యవేడు నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ రోడ్ల పరిస్థితి దారుణంగా వుంది. వాటిని బాగుపరచడమే నా తొలి ప్రాధాన్యత. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని 33 రోడ్ల పనులకు టెండర్లు పిలిస్తే పీఎల్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ తరపున టెండర్లు దక్కించుకుని పది పనులు మాత్రమే చేపట్టి మిగిలినవి వదిలేశారు. చేపట్టిన పనుల్లో కూడా కొన్ని ఇంకా పెండింగ్‌లోనే వున్నాయి. ఆ టెండర్లను రద్దు చేసి కొత్తగా పిలిచి పనులు చేపట్టాలి. సంబంధిత మంత్రితో మాట్లాడి త్వరగా పనులు మొదలు పెట్టడానికి ప్రయత్నిస్తా.

వెంకటగిరి

పార్క్‌గా పోలిశెట్టి గుంట


కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి పట్టణంలో ఇప్పటి వరకూ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కు లేదు. పోలిశెట్టి గుంట ఒకప్పుడు మంచినీళ్ళ కుంట.ఊటబావి వుండేది. మొత్తం పూడిపోయింది. గతంలో పూడిక తీతకు, పార్కు ఏర్పాటుకు ప్రయత్నం జరిగినా సఫలం కాలేదు.ఇపుడు దానిపై దృష్టి పెడుతున్నాం.పూడిక తొలగించి తెలుగు గంగ నీటిని మళ్ళించి కుంటను నింపాల్సి వుంది. అందులో బోటింగ్, కుంట చుట్టూ పార్కు ఏర్పాటు చేస్తాం. పార్కులో వాకింగ్ ట్రాక్ నిర్మిస్తాం. ఆరు నెలల్లో పోలిశెట్టి గుంట రూపురేఖలు మార్చడాన్ని తొలి ప్రాధాన్యంగా పెట్టుకున్నా.

శ్రీకాళహస్తి

ముక్కంటి ఆలయ ప్రక్షాళన


బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తీశ్వరాలయ పాలనను ప్రక్షాళన చేయడం నా తొలి ప్రాధాన్యత. ఆలయంలో దళారీ వ్యవస్థ, అధికార యంత్రాంగంలో అవినీతి పాతుకుపోయాయి. గెలిచిన మరుసటి రోజే ఆలయంలో అవినీతికి పాల్పడిన అధికారులను ప్రాధాన్యత లేని విభాగాలకు బదిలీ చేయించా. అడ్డదారి దర్శనాలకు అడ్డుకట్ట వేశా. దాతల సాయంతో ఆలయంలో శిల్ప సౌందర్యంతో కూడిన స్తంభాలకు స్వర్ణ తాపడం చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.ముక్కంటీశుడి దర్శన సేవలన్నింటినీ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో అందించేందుకు కసరత్తు చేస్తున్నాం.ఆలయానికి అదనపు ఆదాయం కోసం రాహుకేతు పూజల్లో వీవీఐపీల కోసం కొత్తగా 7 వేల రూపాయల టికెట్ ప్రవేశపెడుతున్నాం.

సూళ్లూరుపేట

పేట పట్టణాలకు తాగునీరు


నెలవల విజయశ్రీ

సూళ్ళూరుపేట, నాయుడుపేట పట్టణాలకు శాశ్వత ప్రాతిపదికన తాగునీటిని అందించడం నా ప్రథమ ప్రాధాన్యం. దీనికోసం ఆరు నెలల ప్రణాళిక సిద్ధం చేసుకున్నా. అందులో భాగంగా కాళంగి నదిపై గ్రాయిన్ నిర్మించి సూళ్ళూరుపేటలో భూగర్భ జలాలు వృద్ధి చెందేందుకు చర్యలు తీసుకుంటా. గత టీడీపీ ప్రభుత్వం సూళ్ళూరుపేటకు తాగునీటి సరఫరా కోసం రూ. 162 కోట్లు మంజూరు చేసింది. ఆ పనులు పూర్తి చేయించి తాగునీటి సమస్య పరిష్కరించడానికి ప్రయత్నిస్తా.

తిరుపతి

గంజాయిని నిర్మూలిస్తా


ఆరణి శ్రీనివాసులు

తులసి వనంలాంటి ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని గంజాయి వనంలా వైసీపీ నేతలు మార్చేశారు. గతంలో కరుణాకర రెడ్డి మోకాటి లోతు నీళ్లలో దిగి మద్యరహిత నగరంగా కావాలని డిమాండు చేశారు.2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినతర్వాత తిరుపతిలో గంజాయి కనపడకూడదని చెట్టూ, పుట్టా తిరిగారు. ఈ రెండూ జరగకపోగా మరింతగా పెరిగిపోయింది. తిరుపతిలో అనేక అవాంఛనీయ ఘటనలకు విచ్చలవిడి మత్తు పదార్థాల వినియోగమే కారణం. జనావాసాలు లేని చోట్ల వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లు గంజాయి బ్యాచ్‌కు అవాసాలుగా మారాయి. యాత్రికులు, ప్రజలపై దాడులకు దిగుతున్నారు. తిరుపతిలో గంజాయి నిర్మూలనను నా తొలి ప్రాధాన్యతగా తీసుకుంటా. ఇప్పటికే రాష్ట్ర హోం మంత్రి అనిత గంజాయి నిర్మూలనపై స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారు.

చంద్రగిరి

రిజర్వాయర్‌గా రాయలచెరువు


పులివర్తి నాని

రాయలచెరువును రిజర్వాయర్‌గా మార్చడం, తలకోన జలాలను పంటల సాగుకు మళ్ళించడం.. ఇవీ నా తొలి ప్రాధాన్యాలు. ఈ రెండూ చేయగలిగితే నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుంది. రైతు పచ్చగా ఉంటే అన్ని వర్గాల ప్రజలూ ఆనందంగా జీవిస్తారు. ఈ పనులను ఆచరణ రూపంలోకి తీసుకువచ్చేందుకు డీపీఆర్ రూపొందించే పనిలో ఉన్నా. డీపీఆర్ తయారు కాగానే సీఎం చంద్రబాబును కలిసి నిధుల మంజూరు కోసం ప్రయత్నిస్తా. ప్రతిపాదనలు తయారు చేయడానికి, అలాగే సంబంధిత ఫైలు కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రిటైరైన ఇరిగేషన్ ఇంజనీర్ల సేవలు వినియోగించుకుంటా. సాధ్యమైనంత త్వరలో వీటిని సాకారం చేసి చూపిస్తా.

సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

రౌడీయిజం, గంజాయి కనిపించకూడదు

అధికారుల సమీక్షలో సీఎం చంద్రబాబు

కుప్పం నుంచే పేదరిక నిర్మూలన


అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

కుప్పం, జూన్ 26: 'సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ నా విధానం. పేదరిక నిర్మూలనకు కుప్పం నుంచే శ్రీకారం చుడతా. దీంతో పాటు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికీ అవసరమైన ప్రణాళికలను తయారు చేయండి' అని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. కుప్పంలోని డిగ్రీ కళాశాలలో బుధవారం ఆయన జిల్లా, నియోజకవర్గ అధికారులతో అభివృద్ధిపై సమీక్షించారు. అధికారులు ఫిజికల్, వర్చువల్ పనివిధానాలకు సిద్ధపడాలని సూచించారు. ప్రజోపయోగ కార్యక్రమాలు, పథకాల అమలుకోసం అధికారులు సాధ్యమైనంత వేగంగా స్పందించి ఆయా పనులను కార్యరూపంలో పెట్టాలన్నారు. తమ ప్రభుత్వ ప్రాధాన్యతలు, ఆలోచనలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. 'కుప్పంలో ఇక రౌడీయిజం కనిపించకూడదు. గంజాయి స్మగ్లింగ్, పెంపకం, దొంగ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు ఆగిపోవాలి. రాజకీయ ప్రోద్బలంతో పెట్టిన తప్పుడు కేసులు, తప్పుడు రౌడీషీట్లు ఎత్తేయండి' అని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గత ఐదేళ్లలో కొందరు అధికారుల పనితీరు పట్ల చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. గత తప్పిదాలను ఎత్తిచూపారు. అలాంటి వాళ్లంతా తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. '2019 వరకు నాపై ఒక్క కేసు కూడా లేదు. అలాంటిది ఈ ఐదేళ్లలో నాపైనా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అనేక అక్రమ కేసులు పెట్టారు. ప్రభుత్వ వ్యవస్థలు నాశనం కావడం నాకు చాలా బాధ కలిగించింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'జిల్లాలోను, కుప్పంలోను మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొనాలి. అందుకు ఇప్పటినుంచే సక్రమమార్గంలో వేగంగా పనిచేయడం ప్రారంభించాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నియోజకవర్గంలో మార్పు కనిపించాలి

కుప్పం నియోజకవర్గంలో కొన్ని సమస్యలు సవాళ్లు విసురుతున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా ఇంటింటికీ శుద్ధ జలాన్ని అందించే ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కెనాల్‌కు సంబంధించి పెండింగు పనుల పూర్తికి ప్రణాళిక రూపొందించాలన్నారు. పాడి, పట్టు, తేనె ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. పండ్లు, కూరగాయలకు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు తెస్తామని, అందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కుప్పాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. రైతులకు సబ్సిడీలు అందించడంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, ఇతర జిల్లా, నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ పదవులకు

అభినయ్ రాజీనామా

పోలింగ్‌కు 40 రోజుల ముందే చేసినా బయటకు పొక్కనివ్వని యంత్రాంగం



తిరుపతి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ తన పదవికి రాజీనామా చేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 4వ డివిజన్ కార్పొరేటర్ పదవికి కూడా ఆయన రాజీనామా చేశారు. పోలింగ్‌కు 40 రోజుల ముందే రాజీనామా లేఖ సమర్పించారని తెలిసింది. అయితే మున్సిపల్ యంత్రాంగం ఈ విషయం చాలా గోప్యంగా ఉంచింది. ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా లేఖను బయటపెట్టవద్దని తీవ్రంగా ఒత్తిడి చేసినట్టు తెలిసింది. ఫలితాల తర్వాత అభినయ్ రాజీనామా చేసినట్టు లీకులు వచ్చినా అధికారులు ధృవీకరించలేదు. అయితే అభినయ్ రాజీనామా లేఖ బుధవారం బయటకు వచ్చింది. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న నేపథ్యంలో డిప్యూటీ మేయర్ పదవితో పాటు కార్పొరేటర్‌గా రాజీనామా చేస్తున్నట్టు అందులో ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 6న మేయర్‌కు లేఖ రాయగా, అదేరోజు మేయర్ డాక్టర్ శిరీష రాజీనామా లేఖను ఆమోదించారని తెలుస్తోంది.

గోప్యత ఎందుకు?

రాజీనామాపై ఇంత గోప్యత పాటించడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.జనవరి 4న అభినయ్‌ని ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ అధినాయకత్వం ప్రకటించింది.అప్పటినుంచి ఆత్మీయ సమ్మేళనాలు, సమావేశాలతో బిజీగా మారారు.నామినేషన్ వేయకముందే డిప్యూటీ మేయర్ హోదాతో ఇద్దరు గన్‌మెన్లను ప్రభుత్వం నుంచి నియమించుకున్నారు. నిజానికి డిప్యూటీ మేయర్ హోదాకు గన్‌మెన్లను ఇవ్వరు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కూడా చంద్రగిరి అభ్యర్థిగా ప్రకటించిన వెంటనే తన ఎంపీపీ పదవికి రాజీనామా ఇచ్చారు. అభినయ్ ఏప్రిల్ 6న ఎవ్వరికీ చెప్పకుండా రాజీనామా చేసేసినా రహస్యంగానే ఉంచారు. ఎలాగూ తామే గెలుస్తామన్న ధీమాతోనే కార్పొరేటర్ పదవికి కూడా రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. కాగా ఎన్నికల ఫలితాల అనంతరం అంచనాలు తారుమారవ్వడంతో రాజీనామాను వెనక్కి తీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం.

4వ డివిజన్ నుంచి ఎన్నికై...

తిరుపతిలోని 4వ డివిజన్ నుంచి ఏకగ్రీవంగా అభినయ్ కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. టీడీపీ అభ్యర్థి గీతను వైసీపీ నేతలు బెదిరించడంతో ఆమె నామినేషన్ వేయకుండానే తిరుగుముఖం పట్టారు. 2021 మార్చి 18న అభినయ్ కార్పొరేటర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. నాలుగు నెలల తర్వాత తన పుట్టినరోజైన జులై 30న డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. 31వ డివిజన్ కార్పొరేటర్ సీకే రేవతి ప్రతిపాదించగా 49వ డివిజన్ కార్పొరేటర్ సంధ్యారాణి తదితర కార్పొరేటర్లు బలిపరిచారు. కాగా ప్రతిపాదించిన కార్పొరేటర్ రేవతి ఎన్నికలకు ముందే జనసేనలో చేరిపోయారు.

టీడీపీ ఎంపీటీసీ దంపతుల హత్యకు కుట్ర

● కిరాయి వ్యక్తులతో వైసీపీ నేతల ఒప్పందం ● బహిర్గతం కావడంతో తప్పొప్పుకున్న నిందితులు ● క్షమించి పెద్దమనసు చాటుకున్న ఎంపీటీసీ దంపతులు


ఆరేటమ్మ గుడి ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మధుసూదన్

ఎర్రావారిపాలెం,జూన్ 26 : టీడీపీ ఎంపీటీసీ దంపతుల హత్యకు కుట్ర పన్ని కిరాయి హంతకులకు సుపారీ కూడా ఇచ్చిన వైసీపీ నాయకుల వుదంతమిది. ఎర్రావారిపాలెం మండలం కూరపర్తివారిపల్లికి చెందిన అభ్యుదయవాది అన్నాసముద్రం మధుసూదన్ టీడీపీ నాయకుడు. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఇతను అదే గ్రామానికి చెందిన ఈశ్వరమ్మను గతంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈమె ప్రస్తుతం ఎంపీటీసీ. మధుసూదన్ రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేని కొందరు పలుసార్లు గొడవపడ్డారు. మండలానికి చెందిన ఓ బడా వైసీపీ నాయకుడి సహకారంతో ఆ పార్టీ వర్గీయులు ప్రతాపరెడ్డి, సిద్ధరామిరెడ్డి, నారాయణరెడ్డి ఎంపీటీసీ దంపతులను హత్య చేసేందుకు కుట్ర పన్నారు. కేవీపల్లికి చెందిన కిరాయి వ్యక్తులతో రూ.5లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. ఎర్రావారిపాలెం, తిరుపతి ప్రాంతాల్లో కిరాయివ్యక్తులు రెండుసార్లు హత్యకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో ఎన్నికలు జరగడం, టీడీపీ అధికారంలోకి రావడంతో కిరాయి ముఠా పన్నాగం ఆలస్యమైంది.దీంతో హత్య చేసేందుకు తామిచ్చిన డబ్బు తిరిగి చెల్లించాలని కిరాయి వ్యక్తులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. అప్పటికే మధుసూదన్ మంచితనం గురించి తెలుసుకున్న కిరాయి వ్యక్తులు మనసు మార్చుకున్నారు. హత్య పన్నాగం గురించి అతడికే చెప్పి క్షమించాలని కోరారు. హత్య కుట్రదారులు తమతో జరిపిన ఫోన్ సంభాషణలను కూడా మధుకు వినిపించారు. హత్య కుట్ర బహిర్గతం కావడంతో గ్రామస్తులందరూ విస్మయం చెందారు. ఈ నేపథ్యంలో ఆరేటమ్మ గుడి ప్రాంగణం వద్ద బుధవారం మండలానికి చెందిన పెద్దలందరూ సమావేశమై వైసీపీ నేతలు ముగ్గురినీ పిలిపించారు.కుట్రదారులు తమ అపరాధాన్ని మన్నించాలని వేడుకొన్నారు. ఆరేటమ్మ గుడి అభివృద్ధికి తలో రూ.10 లక్షలు ఇస్తామన్నారు. వీరిని గ్రామ బహిష్కరణ చేయాలని తీర్మానించినా మధుసూదన్ వద్దని వారించారు. కక్షప్రతీకారం వీడి కలసి ఉందామని హితవు పలికారు.ఈలోపు కుట్రదారులకు గ్రామస్తులు దేహశుద్ధి చేశారు.

6 కేజీల గంజాయి పట్టివేత

మంగళం, జూన్ 26 : తిరుపతి నగర శివారు ప్రాంతమైన మంగళం పరిధిలోని బొమ్మల క్వార్టర్స్ వద్ద 6 కేజీల గంజాయిని పట్టుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. తిరుచానూరు సీఐ శ్రీకాంత్ రెడ్డి కథనం మేరకు...బొమ్మల క్వార్టర్స్‌లో గంగాధర్, కృష్ణారెడ్డి,పరీదా అనే ముగ్గురు గంజాయి అమ్ముతున్నట్టు తెలుసుకున్న పోలీసులు బుధవారం వారిని అదుపులోకి తీసుకున్నారు.గతంలోనూ వీరు గంజాయి కేసుల్లో నిందితులైనట్లు గుర్తించారు.గంజాయి విక్రయాలతో ఇక్కడి ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పెడదారి పట్టడంతో పాటు స్థానిక యువత నేరాలు,ఘోరాలకు పాల్పడుతున్నారని సీఐ తెలిపారు.నిందితులపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 26: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా అధికారి డి.సుశీలాదేవి పేర్కొన్నారు. ఉచితంగా నూతన ఆధార్‌కార్డు నమోదు, రూ.30తో ఆధార్ కార్డు ప్రింట్, ఇంటి చిరునామా, పుట్టినతేదీ, పేరు, మొబైల్ నెంబరు, ఈ మెయిల్ ఐడీ మార్చుకోవాలంటే రూ.50, బయోమెట్రిక్, ఫొటో అప్‌డేట్‌కి రూ.100 చెల్లించాలన్నారు.5-7సంవత్సరాలలోపు పిల్లలకు, 15-17సంవత్సరాల వారికి ఉచితంగా తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్, 7-15సంవత్సరాలలోపు వారు, 17సంవత్సరాలు పైబడినవారు రూ.100చెల్లించి బయోమెట్రిక్ అప్డేట్ చేసుకునే సేవలను అందుబాటులోకి తెచ్చిందని వివరించారు.తిరుపతి జిల్లా పరిధిలోని పౌరులు తమ ఆధార్‌కార్డు చిరునామాలో జిల్లా పేరును తిరుపతి జిల్లాగా మార్పు చేసుకునేందుకు ఆధార్ ప్రాధికారసంస్థ అవకాశం కల్పించిందని తెలిపారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10.30నుంచి సాయంత్రం 5గంటలవరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

మత్తు పదార్థాలతో నాశనం చేసుకోవద్దు


మత్తు పదార్థాల అనర్థాలను వివరిస్తున్న సీఐ శ్రీరాములు

పాకాల, జూన్ 26: మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పాకాల ఇన్‌చార్జ్ సీఐ శ్రీరాముడు హితబోధ చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, మాదక ద్రవ్యాల వినియోగంతో తలెత్తే అనర్థాల గురించి వివరించారు. అనంతరం ర్యాలీ జరిగింది. ఆర్టీసీ బస్టాండు జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సైలు లోకేష్ కుమార్, మహేష్‌బాబు, ఇషాక్ బాషా, ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, ఎన్ఎస్ఎస్ పీవో మునిరాజ, అధ్యాపకులు,తదితరులు పాల్గొన్నారు.

నేడు వల్లివేడులో విద్యుత్ వినియోగదారుల సమావేశం

పాకాల, జూన్ 26: వల్లివేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటలకు విద్యుత్ వినియోగదారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు రూరల్ ఏఈ జనార్దన్ రావ్ తెలిపారు. వినియోగదారులు పాల్గొని విద్యుత్ బిల్లులు తదితర సమస్యలను ప్రస్తావించి పరిష్కారం కోరవచ్చునన్నారు.

ఈ మృతదేహం ఎవరిదో ?



పాకాల, జూన్ 26: మ్యాంగోనగర్ సమీపంలోని చెరువు కట్టపై బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతునికి సుమారు 45 సంవత్సరాల వయస్సుంటుందని భావిస్తున్నారు. మ్యాంగోనగర్ పరిసరాలలో ప్లాస్టిక్ బాటిళ్ల, పేపర్లు ఏరుకుంటూ జీవనం సాగించేవాడని స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.

కల్‌రోడ్డుపల్లె పంచాయతీలో డీఎల్పీవో తనిఖీలు


పంచాయతీ ఆఫీసులో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్పీవో రూపారాణి

చంద్రగిరి, జూన్ 26: కల్‌రోడ్డుపల్లె పంచాయతీ కార్యాలయాన్ని డీఎల్పీవో రూపారాణి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పారిశుధ్యంపై కార్యదర్శి సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. ఓవర్ హెడ్ ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్ నిర్వహణను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈవోపీఆర్డీ శశిరేఖ, కార్యదర్శి సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో 'నేను బడికి పోతా' ర్యాలీ



చంద్రగిరి, జూన్ 26: బడి ఈడు పిల్లలు పాఠశాలలో చేరాలని కోరుతూ చంద్రగిరిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం జరిగిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు లలిత కుమారి, భాస్కర్ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు, విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలల విద్యార్థులకు పారిశుధ్యం, ఆరోగ్యం గురించి వైద్యులు, సిబ్బంది వివరించారు. డయేరియా వ్యాధి పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు.

భవిత కేంద్రం సందర్శన


ప్రత్యేక అవసరాల పిల్లలతో ఐఈసీ చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రగిరి, జూన్ 26: చంద్రగిరిలోని భవిత కేంద్రాన్ని జిల్లా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన భవిత కేంద్రంలోని పిల్లలు, తల్లితండ్రులతో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అందిస్తున్న ఉపకరణాలు, వివిధ అలవెన్సులు, సమగ్ర శిక్ష ద్వారా అందుతున్నాయా లేదా అని ఆరా చేశారు. వాటిని సద్వియోగం చేసుకోవాలన్నారు. స్పీచ్ థెరపీ, ఫిజియో థెరపీని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఈవో భాస్కర్‌బాబు, ఐఈఆర్‌టీలు వెంకటరాజేశ్వరి, శ్యామలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా,అంటువ్యాధులపై అప్రమత్తం


మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉషారాణి

రామచంద్రపురం, జూన్ 26: వర్షాల నేపథ్యంలో డయేరియా, అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల రెవెన్యూ తహసీల్దార్ ఉషారాణి కోరారు. బుధవారం అనుపల్లి, బొప్పరాజుపల్లి, నెత్తకుప్పం, నూతగుంటపల్లి, సూరవారిపల్లి, కుప్పంబాదూరుల్లోని పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాగునీటి ట్యాంకులను బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టాలని సచివాలయ సిబ్బందిని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్ రాజ్ ఆదేశించారు. విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఎంఈఓ మార్కండేయ నాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్ రాజు, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రామచంద్రాపురం, జూన్ 26: ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ప్రయత్నం జరుగుతోందని ఎస్వీ యూనివర్సిటీ ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉదయ్‌కుమార్ చెప్పారు. కమ్మకండ్రిగలో జీనోమ్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం 150 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని పదివేల మంది ఆరోగ్యవంతుల నుంచి 10 ఎంఎల్ రక్తం సేకరించి జన్యు వైవిధ్యాల సమగ్ర జాబితాను రూపొందిస్తున్నారన్నారు. ప్రొఫెసర్ జీఎస్ జా, సంజీవ్, డాక్టర్ సఫిక్, టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకుడు జనార్దన్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గసముద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందాం

తిరుపతి రూరల్, జూన్ 26: తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం సచివాలయంలో గ్రామానికి చెందిన టీడీపీ జిల్లాప్రధానకార్యదర్శి యు.మునిశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఫొటోలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భగా కేక్‌ని కట్ చేశారు. మునిశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుకుందామని తెలిపారు. నాయకులు రామచంద్రయ్య, రమేష్ బాబు, బాబురాయల్, నాగరాజు, సుధాకర్, రవి, వెంకటమునిరెడ్డి, చంద్రశేఖర్, శంకర్, చెంగల్‌రాయల్, ప్రహ్లాదరెడ్డి, డిల్లీ, కుమార్, రమణారెడ్డి, చెంగయ్యాయాదవ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేటినుంచి సుందరరాజస్వామి అవతార మహోత్సవాలు

తిరుచానూరు, జూన్ 26: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీసుందరరాజస్వామి వార్షిక అవతార మహోత్సవాలు గురువారం నుంచి ఈనెల 29వరకు జరగనున్నాయి. శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో మూడు రోజులూ మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 4గంటల వరకు సుందరరాజస్వామికి అభిషేకం నిర్వహిస్తారు.సాయంత్రం 5.45నుంచి 6.15గంటల వరకు ఊంజల్ సేవ జరుగుతుంది. రాత్రి 7నుంచి 8.30 గంటల వరకు వాహనసేవ నిర్వహిస్తారు. మొదటిరోజు పెద్దశేషవాహనం, రెండోరోజు హనుమంత వాహనం, చివరిరోజు గరుడవాహనంపై మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఉత్సవాల సందర్భంగా పద్మావతి అమ్మవారి ఊంజల్‌సేవ రద్దు చేసినట్లు టీటీడీ పీఆర్వో పేర్కొన్నారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]


సెబ్ అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

ఇసుక అక్రమదందాపై అధికారుల కొరడా..!

మూడుశాఖల అధికారులు మెరుపుదాడులు ● 18 ఇసుక ట్రాక్టర్ల సీజ్

తిరుచానూరు, జూన్ 26: తిరుచానూరు పరిసర ప్రాంతాల్లో స్వర్ణముఖినదిలో జేసీబీలు పెట్టి ఇష్టానుసారంగా వైసీపీ ఇసుక మాఫియా వందల ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఆగని ఇసుక దందా-సర్కారు మారినా తవ్వకాలు ఆపని వైసీపీ మాఫియా శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీని పైఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర స్పందించారు. అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో సెబ్, తిరుచానూరు, ఎంఆర్‌పల్లె పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ బృందం మెరుపుదాడులు నిర్వహించారు. ఒక్క తిరుచానూరు వద్దే 18 ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసులు నమోదు చేశారు. స్వర్ణముఖినదిలో అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకుంటామని, క్రిమినల్ కేసులు పెడతామని పోలీసులు హెచ్చరించారు. ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. అక్రమంగా తవ్వకాలు చేపడితే వారిపై కఠినచర్యలు ఉంటాయన్నారు. రోజూ తనిఖీలు చేస్తామని, ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించేదిలేదని సెబ్ (అడిషనల్ ఎస్పీ) జిల్లా అధికారి రాజేంద్ర ఆంధ్రజ్యోతికి తెలిపారు. గడిచిన ఐదేళ్లగా తిరుపతి రూరల్‌మండలంలో లక్షలాది రూపాయల విలువచేసే ఇసుకను అక్రమంగా తరలించిన వైసీపీ మాఫియానే తిరుచానూరు, పాడిపేట, ముండ్లపూడి, కొత్రమంగళం, తనపల్లె ప్రాంతాల్లో స్వర్ణముఖినదిలో జేసీబీలతో తవ్వేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం మేల్కొని కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మాదకద్రవ్యాల కట్టడికి సంపూర్ణ సహకారం

● ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 26: పిల్లల్లో అనుమానాస్పద మార్పులు ఉంటే సంబంధిత పోలీసు అధికారులకు తెలియపరచాలని తల్లిదండ్రులకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే బుధవారం ఫోన్ ద్వారా అధికారులతో మాట్లాడారు. గ్రామీణ యువత మాదకద్రవ్యాల బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటోందని, దీనిపై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. గత పాలకులు చేసిన స్వార్థపూరిత కార్యక్రమాల వల్ల యువత భవిష్యత్ మత్తు పదార్థాలతో అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు అధికారులు తీసుకునే చర్యలకు టీడీపీ పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తుందని, చంద్రగిరిని మత్తు పదార్థాల రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. దీనికోసం పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు తనీషజాయి ఎంపిక



తిరుపతి రూరల్, జూన్ 26: స్థానిక యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ స్కూల్‌లో 7వ తరగతి చదివే విద్యార్థిని టి.తనీషజాయి జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు చైర్‌పర్సన్ రమాదేవి పేర్కొన్నారు. విజయవాడలో ఈనెల24న నిర్వహించిన అండర్-13 బాలికల విభాగంలో తమ విద్యార్థిని ప్రతిభచాటి నేషనల్‌కు అర్హత సాధించిందని తెలిపారు. విద్యార్థినిని కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ శ్వేతారెడ్డి, కోచ్ టి.ధనంజయులు, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, టీచర్లు అభినందించారు.

అసదుద్దీన్ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

తిరుపతిరూరల్, జూన్ 26: భారత పార్లమెంటులో పాలస్తీనాకి జైఅంటూ ప్రమాణస్వీకారం చేసిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల పేర్కొన్నారు. దేశ ప్రజలను అవమానపరచే విధంగా వ్యవహరించిన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసి దేశద్రోహం చర్యలు చేపట్టాలని తెలిపారు. భారత రాజ్యాంగ ఆర్టికల్ 102డీ ప్రకారం నేరపూరితమైందని, ఒక విదేశాన్ని మనస్పూర్వకంగా సమర్థించడం దేశ భవిష్యత్ రీత్యా మంచిదికాదని, ఇటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్మును కోరారు.

పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న టీటీడీ ఈవో



తిరుచానూరు, జూన్ 26: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని టీటీడీ ఈవో జె.శ్యామలరావు బుధవారం దర్శించుకున్నారు. ఈవోగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయం వద్ద జేఈవో వీరబ్రహ్మం స్వాగతం పలికారు. ధ్వజస్థంభానికి మొక్కుకున్న అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆశీర్వాద మండపంలో ఈవోకు వేదపండితులు వేద ఆశీర్వాదం చేశారు. జేఈవో ప్రసాదాలను అందించారు. ఆలయ డిప్యూటీఈవో గోవిందరాజన్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబుస్వామి పాల్గొన్నారు.

నేడు వేరుశనగ విత్తనాల పంపిణీ

చంద్రగిరి, రామచంద్రాపురం, జూన్ 26: చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొననున్నారు. చంద్రగిరిలోని నూకలగుంట వద్ద రైతు భరోసా కేంద్రంలో ఉదయం 10 గంటలకు, రామచంద్రాపురం మండలంలోని గంగిరెడ్డిపల్లిలో రైతు భరోసా కేంద్రంలో ఉదయం 11 గంటలకు వేరుశనగ, జనుము విత్తనాలను ఆయన పంపిణీ చేయనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు.

తలకోన దేవస్థానం పాలక మండలి రాజీనామా

ఎర్రావారిపాలెం,జూన్ 26; తలకోన దేవస్థానం మండలి చైర్మన్ భూమిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆలయ ఈఓ జయకుమార్ ఈ విషయం తెలిపారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో నామినేట్ అయిన పాలక మండలి చైర్మన్‌తో పాటు సభ్యులు నాగిరెడ్డి, మంజుల,సురేష్,మధుసూదనశెట్టి,రాజేశ్వరి కూడా రాజీనామా పత్రాలను సమర్పించారన్నారు.

జడ్పీ మాజీ సీఈవోపై సీఎంకు ఫిర్యాదు

చిత్తూరు రూరల్, జూన్ 26: జడ్పీ మాజీ సీఈవో ప్రభాకరరెడ్డిపై సీఎం చంద్రబాబు నాయుడికి బుధవారం కుప్పంలో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. వైసీపీ హయాంలో జడ్పీ సీఈవోగా ఆయన అవినీతికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, సర్పంచులు, కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఇతడి వేధింపుల కారణంగా నలుగురు ఉద్యోగులు మృత్యువాత పడ్డారని తెలిపారు. కోట్ల రూపాయల జడ్పీ నిధులను మంత్రికి ముట్టజెప్పారని ఫిర్యాదులో ఆరోపించారు. అనంతరం సీఎం ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్నను కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ప్రభాకర్‌రెడ్డి అవినీతిపై డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈయన ప్రభాకర్‌రెడ్డి వ్యవహారాలను దగ్గరగా చూశారు.

పీఆర్ కమిషనరేట్‌లో కదలని ఫైల్!

జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర్‌రెడ్డిపై టీడీపీ నాయకులు, ఉద్యోగులు, విశ్రాంత అధికారులు పీఆర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఆ ఫైల్ ముందుకు కదలడం లేదని తెలిసింది. ఈ నెలాఖరున ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ చేయనున్నారు. ఈలోగా ఈయన్ను సస్పెండ్ చేయించాలని పట్టుగా ఉన్న టీడీపీ నాయకులు.. పీఆర్ కమిషనరేట్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమం లో సీఎం చంద్రబాబును కలిసి ఫిర్యాదు చేశారు.

మాటల్లో స్పష్టత.. సంకల్పంలో ధీరత

కేడర్‌కు దిశానిర్దేశం

అధికార యంత్రాంగానికి అభివృద్ధి ఆదేశం

ప్రజలకు బంగారు భవిష్యత్తు సందేశం

సరికొత్త చంద్రబాబును చూస్తారని హామీ

ముగిసిన రెండు రోజుల కుప్పం పర్యటన

అప్‌డేట్ 'బాబు'


కుప్పం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద నాయకులు, కార్యకర్తల సందడి

నా మాట వినండి. చెప్పింది చేయండి. మీ భవిష్యత్తు బంగారుమయం చేసే పూచీ నాది.
- ఐదేళ్ల వైసీపీ విధ్వంసంలో ప్రజలు ఎందుకూ కాకుండా పోయారన్న ఆవేదన.

'షో చేయడంవల్లే ఇంత దీనస్థితి. నేను, ప్రజలు అంతా బాగనే ఉన్నాం. మీరే బాగలేదు. ఇక మీదట ఇలాంటి తీరు సహించేది లేదు.
- మెజారిటీ రావాల్సినంత రానందుకు ముఖ్య స్థానాల్లో ఉన్న పార్టీ కేడర్‌పై ఆగ్రహం.

ఐదేళ్లలో మీలో కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. ఇక అటువంటి ఆటలు చెల్లవు. సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని రండి.
- అధికార యంత్రాంగంపై అసహనంతోపాటు జరగాల్సిన అభివృద్ధిపై ఆదేశం.

అవును.. 'బాబు' అప్‌డేట్ అయ్యారు. ఆ మాట ఆయనే స్వయంగా అన్నారు. 'పాత రాజకీయం ఇక పనిచేయదు. ఆ రాజకీయాలను మార్చాలి. నేను కూడా మారాలి. మారతాను' అని పార్టీ శ్రేణుల సమావేశంలో స్పష్టం చేశారు. ఆయన మారిన తీరుకు కుప్పం నియోజకవర్గంలో మంగళ, బుధవారాల్లో జరిగిన పర్యటనే తక్షణ నిదర్శనం.

- కుప్పం

టైమ్ ప్రకారం షెడ్యూల్

అన్నింటికంటే అందరినీ ఆశ్చర్యం కలిగించిన సంఘటన.. రెండు రోజుల చంద్రబాబు పర్యటన షెడ్యూల్ టైమ్ ప్రకారం సాగడం. మంగళవారం ఉదయం షెడ్యూల్ సమయం కంటే కేవలం అరగంట ఆలస్యంగా పీఈఎస్ హెలిప్యాడ్‌కు చేరుకున్న ఆయన, బుధవారం సాయంత్రం చెప్పిన సమయమైన సాయంత్రం 4.10 గంటలకు అదే హెలిప్యాడ్‌నుంచి వీడ్కోలు తీసుకున్నారు. చెప్పిన షెడ్యూల్ మించి, ఒక్కటంటే ఒక్క ఇతర సమావేశాల్లో పాల్గొనడం కానీ, ముందుగా ప్రకటించని ప్రాంతాలకు వెళ్లడం కానీ చేయలేదు. దీంతో ఇటు పార్టీ కేడర్‌తోపాటు అటు అధికార యంత్రాంగం కూడా పూర్తిగా ఖుషీ అయింది.

జన నీరాజనం

నాలుగోసారి ముఖ్యమంత్రిగా అధికార పీఠం అధిష్ఠించిన తర్వాత తొలిసారిగా సొంత నియోజకవర్గంలో అడుగు పెట్టిన చంద్రబాబుకు ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. నిజానికి ఆయన శైలికి భిన్నంగా బస్సు దిగి కిందికి రాకపోయినా, దారి పొడవునా గజమాలలు, పూల వర్షాలతో సత్కరించి తమ గుండెల్లోని అభిమానం చాటుకుంది. మహిళలు మంగళ హారతులిచ్చి దిష్టి తీశారు. చిరునవ్వులతో తమ ఆనందాతిరేకాలను ప్రదర్శించారు. ఇటు ఆర్టీసీ బస్టాండులో జరిగిన సభలో జనం కానీ, ఇటు పార్టీ సమావేశాల్లో కేడర్ కానీ చంద్రబాబు ప్రసంగానికి ఈలలు, కేకలు వేస్తూ ఆయనలో వచ్చిన మార్పుపట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

అభివృద్ధే ఏకైక లక్ష్యంగా..

ముఖ్యమంత్రిగా తొలిసారి కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబు బుధవారం అధికార యంత్రాంగంతో సుదీర్ఘ సమీక్ష జరిపిన తీరు ఆయనలో వచ్చిన మార్పునకు సంకేతం. మంగళవారం కుప్పం సభలో ప్రజలకు హామీ ఇచ్చిన ప్రతి అభివృద్ధి పని గురించీ చంద్రబాబు సమీక్ష చేశారు. గత పాలనకు, తన పాలనకూ మధ్య మార్పు స్పష్టంగా కనిపించి తీరాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించి స్పష్టమైన సమగ్రాభివృద్ధి ప్రణాళికలతో సాధ్యమైనంత త్వరలో తన దగ్గరకు రావాలని ఆదేశించారు. ప్రత్యేకించి నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టి పెట్టారు. గతంలో కంటే ఇది భిన్నమైన తీరు. ఇక్కడికిక్కడే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం, అధికార యంత్రాంగంలోనూ చురుకుదనం పుట్టించే చర్యే. ఇది చంద్రబాబుపై ప్రజల్లో పూర్తిస్థాయిలో నమ్మకం ఏర్పడడానికి దోహదం చేస్తుంది కూడా.

బంగారు భవిత

హంద్రీ-నీవా కాలువ పెండింగు పనులు పూర్తి, అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం, కోల్డ్ స్టోరేజీ, ఆర్ అండ్ బీ భవనం పూర్తి, ఇన్నాళ్లూ మూలన పడ్డ వ్యవసాయ, పట్టు, పాడి, టెక్స్‌టైల్స్ పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికలు, మండల కేంద్రాల అభివృద్ధికి ఒక్కోదానికీ రూ.10 కోట్లు, పంచాయతీల అభివృద్ధికి రూ.కోటి నుంచి రూ.2 కోట్లు, అదనంగా రాళ్లబూదుగూరు, మల్లానూరును మండలాలు చేయడం.. ఇలా నియోజకవర్గ ప్రజలపైన వరాల జల్లు కురిపించారు. 'నేను మీ బాగు కోరే వాడిని. ఇంతకుముందు ఎంతో చేశాను. ఇకమీదటా చేస్తాను. కానీ మీరు కేవలం 48 వేల మెజారిటీ ఇచ్చారు' అని ఆవేదనా వ్యక్తం చేశారు. అలాగని అభివృద్ధి ఆగదని, వచ్చే ఐదేళ్లలో కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా చేస్తానని హామీ ఇచ్చారు.


ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి బారులు తీరిన జనం

హెచ్చరించి.. బుజ్జగించి


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

పార్టీ కేడర్‌తోనూ చంద్రబాబు సమావేశాలు వినూత్న రీతిలో సాగాయి. మంగళవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం.. బుధవారం మధ్యాహ్నం జరిగిన వివిధ స్థాయిలలోని బూత్ స్థాయిదాకా ఉన్న కమిటీలు, ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలోనూ ఇది కనిపించింది. ఎన్నికల్లో తన మెజారిటీ ఏమాత్రం పెరగకపోవడంపైనే చంద్రబాబు పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. ఎక్కడెక్కడో అత్యధికంగా మెజారిటీలు వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, స్వయంగా తన సొంత నియోజకవర్గంలో ఎందుకు రాబట్టలేకపోయారని, పార్టీ కేడర్ సమావేశంలో బాధ్యులను నిలదీశారు. గతంలో నలుగురైదుగురు సీనియర్లను మాత్రమే చేరదీసి వారు చెప్పిన విషయాలే ఆలకించి వెళ్లిపోయే బాబు, ఈసారి మాత్రం ఎన్నికల్లో ఏమాత్రం ఉపయోగపడలేకపోయిన అటువంటి కోటరీని పూర్తిగా పక్కన పెట్టారు. పైగా పిలవనిదే స్టేజీ ఎక్కి షో చేస్తున్నారంటూ మండిపడి, కిందిస్థాయి కార్యకర్తలు, యువ కేడర్‌లో హుషారు పుట్టించారు. కష్టపడేవారి భవిష్యత్తుకు ఢోకా లేదని చాలా స్పష్టంగా చెప్పడమే కాకుండా, కేవలం సీనియారిటీ ఇకమీదట పనిచేయదని, షో చేసేవాళ్లను ప్రోత్సహించేది లేదని కేడర్‌కు స్పష్టంగా తెలియజెప్పగలిగారు.

సఖి-వన్‌స్టాప్ సెంటర్ సేవలపై సమీక్ష



మాట్లాడుతున్న డాక్టర్ యోగేష్ దూబే

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 26: జిల్లాలో సఖి-వన్‌స్టాప్ సెంటర్ రానున్న రోజుల్లో మరిన్ని సదుపాయాలతో ఆదర్శప్రాయమైన సేవలందిస్తుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ యోగేష్ దూబే పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం సఖి-వన్‌స్టాప్ సెంటర్, గృహ హింస చట్టం విభాగ కేంద్రాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షల్లో ఆయన మాట్లాడారు. మహిళా శిశుసంక్షేమ, పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, విభిన్న ప్రతిభావంతులశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు ఇచ్చి దిశా నిర్దేశం చేశారు. పోష్‌యాక్ట్ మేరకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల్లో పనిచేసే మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా కార్యాలయాల్లో తప్పనిసరిగా మహిళలతో అంతర్గత కమిటీలు నియమించి పర్యవేక్షించాలని తెలిపారు. డీఆర్వో పెంచల కిశోర్, అదనపు ఎస్పీ వెంకట్రావు, స్త్రీ, శిశుసంక్షేమ సాధికారిత అధికారిణి ఎస్.విజయలక్ష్మి, డీఈవో డాక్టర్ వి.శేఖర్, అధికారులు చెన్నయ్య, సుజాత, గృహ హింసచట్టం విభాగ కౌన్సెలర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

స్మగ్లర్లను నిరోధించేలా చర్యలు : ఎస్పీ



ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు స్వాగతం పలుకుతున్న శ్రీనివాస్

మంగళం, జూన్ 26: ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా స్మగ్లర్లను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని టాస్క్‌ఫోర్స్ ఇంచార్జ్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతున్న విధానం, అడవుల్లో చేపడుతున్న కూంబింగ్ సమాచార వ్యవస్థ, అటవీశాఖ అధికారుల పనితీరు గూర్చి ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ స్మగ్లర్లను పట్టుకునేందుకు వీలుగా ఆపరేషన్లు చేపట్టాలని, ఫీల్డ్ ఆపరేషన్‌లో అటవీశాఖ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డీఎస్పీ చెంచుబాబు, ఏపీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐలు సురేష్‌కుమార్‌రెడ్డి, కుప్పానంద, చిరంజీవి, కడప, రైల్వేకోడూరు సబ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ ఈవోకు సన్మానం



తిరుపతి అర్బన్, జూన్ 26: టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్లకిరణ్, ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఈవో జె.శ్యామలరావును ఘనంగా సన్మానించారు. సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి రేఖ, సభ్యులు , కల్యాణకట్ట, రవాణా విభాగం, డమ్ అండ్ డఫ్ ఉద్యోగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని భవనానికి నోటీసులు



అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం

మంగళం, జూన్ 26: మంగళం పరిధిలోని సప్తగిరి కాలనీ, బీటీఆర్ కాలనీకి మధ్య ప్రధాన మార్గానికి ఆనుకుని పంచాయతీ నుంచి గాని, తుడా నుంచి గాని ఎటువంటి అనుమతులు తీసుకోకుండా దాదాపు ఐదు అంతస్తులకు పైగా భవనాన్ని నిర్మిస్తుండటంతో నిర్మాణదారుడు శేఖరకు పంచాయతీ కార్యదర్శి విజయ్‌భాస్కర్ బుధవారం నోటీసులు జారీచేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో జి ప్లస్ టూ వరకు మాత్రమే అనుమతులు ఇస్తుందని, అంతకు మించి నిర్మాణాలు చేపడితే తుడా నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నోటీసుకు స్పందించకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని విజయభాస్కర్ తెలిపారు.

తోపుడు బండి వ్యాపారిపై దౌర్జన్యం



బాధితుడు మురళి

మంగళం, జూన్ 26: మంగళం ప్రధాన రహదారి ఆర్టీవో కార్యాలయం కూడలి సమీపంలో బీటీఆర్ పురానికి చెందిన మురళి తోపుడు బండిపై బిర్యానీ అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండేళ్లుగా తోపుడు బండిపైనే బిర్యానీ, కుష్కా అమ్ముతూ పొట్టపోసుకుంటున్న అతడిపై బుధవారం స్థానికంగా ఉండే కొందరు హోటల్ నిర్వాహకులు.. తామంతా ఒక ధరకు బిర్యానీ అమ్ముతుంటే నువ్వెలా తక్కువ ధరకు ఇస్తావంటూ నిలదీసి దౌర్జన్యం చేశారు. తాను రోడ్డుపై వ్యాపారం చేస్తున్నానని, హోటల్లో మాదిరి సౌకర్యాలు ఏమీ లేనందున తనకు బిర్యానీ తయారీకి అయ్యే ఖర్చు, స్వల్ప ఆదాయాన్ని జోడించి రూ.110లకు అమ్ముతున్నానని మురళి చెప్పాడు. అయితే రూ.150లకు తామంతా విక్రయిస్తుంటే నువ్వెలా జరుపుతున్నావని, మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ఇక చేసేదేమిలేక తోపుడు బండి వ్యాపారి మురళి రూ.130లకే విక్రయిస్తానని వారితో చెప్పగా, వారు వెళ్లిపోయారు.

డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితిని 48 ఏళ్లకు పెంచండి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ 2024లో అభ్యర్థుల వయోపరిమితి అర్హతను 44 ఏళ్లనుంచి 48 ఏళ్లకు పెంచాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జయచంద్ర బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. నకిలీ కోచింగ్ సెంటర్లపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా వున్న 35 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. దరకాస్తు చేసుకున్న ప్రతి అభ్యర్థికి ప్రభుత్వం ఉచితంగా మెటీరియల్ అందజేయాలని ఆయన కోరారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, జూన్ 26: పీలేరు వద్ద తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించి నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఓ కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్‌కు అందిన సమాచారం మేరకు.. పీలేరు ప్రభుత్వ ఐటీఐ సమీపంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో ఏపీ 31ఏడబ్ల్యూ 8433 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ వాహనం అటువైపుగా రావడాన్ని అధికారులు గమనించారు. దీంతో వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా, ఆపకుండా వెళ్లిపోయింది. వెంబడించగా కారును వదిలి వెళ్లిపోయారు. వాహనం, అందులో ఉన్న దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుపడ్డ ఎర్రచందనం 128.5కిలోల బరువు ఉందని డీఎఫ్‌వో శివకుమార్ తెలిపారు. పారిపోయినవారి కోసం గాలిస్తున్నారు. సిబ్బంది కోదండన్, చంద్రబాబు, సాయికిరణ్, నాగులయ్య, భార్గవ్, వినీల్‌కుమార్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రథమ సప్లిమెంటరీలో 46శాతం ఉత్తీర్ణత

తిరుపతి(విద్య), జూన్ 26: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో తిరుపతి జిల్లా 45 శాతం ఉత్తీర్ణతను సాధించింది. ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష గతనెల 24వ తేదీన నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఇంటర్ విద్యామండలి ఈనెల 18వ తేదీన విడుదల చేసింది. కాగా బుధవారం ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. ఉత్తీర్ణతా శాతంలో మన జిల్లా రాష్ట్రంలో ఆరవ స్థానంలో నిలిచింది. జిల్లానుంచి జనరల్ విభాగంలో 8,256 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,719 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.ఒకేషనల్ విభాగం నుంచి 438మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 239 మంది ఉత్తీర్ణులయ్యారు.ఈ పరీక్షలకు సంబంధించి షార్ట్ మార్క్స్ మెమో బీఐఈ పోర్టల్లో జూలై 1 నుంచి అందుబాటులో ఉంటుందని విద్యామండలి ప్రకటించింది.

రీ వెరిఫికేషన్‌కు అవకాశం

ప్రథమ సంవత్సరం విద్యార్థులకు రీ వెరిఫికేషన్ అవకాశం కల్పించారు. ఈనెల 28 నుంచి జూలై 4వ తేదీ లోపు విద్యార్థులు రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో సబ్జెక్టుకు రూ. 1000 చొప్పున రీ వెరిఫికేషన్ ఫీజు కట్టాల్సి ఉంటుంది.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.01 కోట్లు

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.01 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 71,824 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 28,462 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

చంద్రబాబుతో ఆరణి భేటీ



తిరుపతి, జూన్26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం కుప్పం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన తనయుడు మదన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీసాయి సుధా ఆస్పత్రిలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

తిరుపతి(వైద్యం), జూన్ 26: స్థానిక తిలక్‌రోడ్డులోని శ్రీసాయి సుధా కంటి వైద్యశాలలో గురువారం ఉచిత గ్లకోమా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దళితులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

తిరుపతి(జీవకోన), జూన్ 26: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం, మారేపల్లి గ్రామంలో క్రికెట్ ఆడుతున్న నవీన్, భాస్కర్ తదితర దళిత యువకులను వేణుగోపాలపురం, వాయిలాల చెరువు చేనుకు చెందిన అగ్రవర్ణాల గ్రామస్తులు కరెంట్ పోల్‌కు కట్టేసి దాడి చేయడాన్ని తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యార్లపల్లి గోపి ఖండించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు శాంతి యాదవ్, రవి, వెంకటేష్ గౌడ్, భానుప్రకాష్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



గోవిందరాజ స్వామి గుడి ఎదురుగా, రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తిరుపతి(ఆటోనగర్), జూన్ 26: మూడురోజులుగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టింది. ఫుట్‌పాత్‌ను ఆక్రమించి బంకులు నడుపుతున్న, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నడుపుతున్న వారిని హెచ్చరించి తొలగింప జేస్తోంది. బుధవారం గోవిందరాజ స్వామి ఆలయ సమీపంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను పొక్లయిన్లతో సిబ్బంది తొలగించారు.

వీధి వ్యాపారులకు అండగా ఉంటాం : ఏఐటీయూసీ

కార్పొరేషన్ అధికారులు ఆక్రమణల నెపంతో, వీధి వ్యాపారులపై దౌర్జన్యం చేయడం తగదని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పి.మురళి, కె.రాధాకృష్ణ చెప్పారు.ఆక్రమణల తొలగింపును నిరసిస్తూ బుధవారం నగర పాలక కార్యాలయం వద్ద జరిగిన వీధి వ్యాపారుల ధర్నాలో వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు వీధి వ్యాపారులు, ఆటో డ్రైవర్ల నుంచి మామూళ్లు వసూలు చేసేవారన్నారు. ప్రస్తుతం టీడీపీ నాయకులు ప్రాంతాల వారీగా విభజించుకొని మామూళ్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. వీరికి అధికారులు అండగా ఉన్నారంటూ కమిషనర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందజేశారు.ఫుట్‌పాత్‌లపై పాదచారులకు అసౌకర్యం కలుగకుండా ఆక్రమణలను తొలగిస్తామని, ఇందుకు సహకరించాలని ఆందోళనకారులను కమిషనర్ కోరారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు నడుం బిగిద్దాం



తిరుపతి(నేరవిభాగం), జూన్ 26: మాదకద్రవ్యాల వ్యతిరేక సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నగరంలోని ఎస్పీ కార్యాలయం నుంచి విద్యార్థులు, పోలీసులు, సెబ్ అధికారులు కలసి జిల్లా సెబ్ ఆధ్వర్యంలో బాలాజీ కాలనీ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు ఎస్పీ హర్షవర్ధనరాజు, కమిషనర్ అదితిసింగ్, సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరాంలు జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకాన్ని అరికట్టడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని కోరారు. యువతీ, యువకులు డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు మాట్లాడుతూ మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. డ్రగ్స్‌ను నాశనం చేసేందుకే ఈ ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేసి నా, సేవించినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ర్యాలీలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, విమల కుమారి, సెబ్ ఈఎస్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఈఎస్ జానకిరాం, డీఎస్పీలు రవిమనోహరాచ్చారి, రమణకుమార్, వెస్ట్ సీఐ జయనాయక్, యూనివర్సిటీ సీఐ మురళీమోహన్‌రావు, సెబ్ తిరుపతి సీఐ సుబ్బారెడ్డి, ట్రాఫిక్ సీఐలు, వివిధ కళాశాలల విద్యార్థులు, పీఆర్‌ఓ నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



ఉదయ భాస్కర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26: వేంకటేశ్వర యూనివర్సిటీ కళల విభాగ పరిశోధకుడు జె.ఉదయ భాస్కర్ డాక్టరేట్ పొందారు. మ్యూజిక్ యాజ్ ఏ క్యాటలిస్ట్ ఇన్ ఎన్రిచింగ్ సెలెక్ట్ గ్రూప్ ఆఫ్ పీపుల్ అనే అంశంపై ప్రొఫెసర్ ప్రేమలత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

సీఎం చిత్రపటాన్ని చెత్తబుట్టలో పడేసిన వారిపై చర్యలు తీసుకోండి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 26: తిరుపతిలోని డ్వామా కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాన్ని చెత్త బుట్టలో మూలనపడేసి అవమానపరచిన అధికారులపై సత్వరమే చర్యలు చేపట్టాలని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఈమేరకు కూటమిపార్టీ నేతలు సింగంశెట్టి సుబ్బరామయ్య, వట్టికుంట చినబాబు, పోకల జనార్ధన్, రుద్రకోటి సదాశివం, కంద్ర లక్ష్మీపతి నాయుడు, జంగం మునిసుబ్రమణ్యం, సురేష్ తదితరులు బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెంచలకిషోర్‌ని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక సీఎం ఫొటోని కార్యాలయం లోపల ఏర్పాటు చేయాల్సి ఉండగా డస్ట్‌బిన్‌లో పడేయడం తీవ్ర ఆక్షేపణీయమని ఖండించారు. డ్వామా కార్యాలయంలో కొంతమంది అధికారులు, సిబ్బంది వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, అటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న మానసిక వైద్య నిపుణురాలు మానస

తిరుపతి(వైద్యం), జూన్ 26: ప్రస్తుత రోజుల్లో యువత ఎక్కువగా మాదక ద్రవ్యాల వాడటానికి అలవాటు పడటం వల్ల ఆరోగ్యంతో పాటు జీవితాలు నాశనమవుతాయని మానసిక వైద్య నిపుణురాలు మానస అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం రుయాస్పత్రిలోని మత్తు పదార్థాల వ్యసన నిర్మూలన కేంద్రంలో మత్తు పదార్థాల వలనే నష్టాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు కూడా నిండని ఎంతో మంది యువత గంజాయి, సిగరెట్లు, మద్యం వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారని చెప్పారు. కుటుంబంలో ఎవరైనా మత్తుకు బానిసలుగా మారుతుంటే తక్షణమే వారిని సంబంధిత వైద్యులకు చూపించి వారి సలహాలను పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మల్లికార్జున్, కవిత, జాహ్నవి, సిబ్బంది ముకుంద నాయుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలు సమాజానికి చేటు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబు

తిరుపతి(విద్య), జూన్ 26: మాదకద్రవ్యాలు సమాజానికి చేటు అని స్థానిక టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల మాదకద్రవ్యాల వినియోగం ఎక్కువైపోయిందని, ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో నగరంలో ర్యాలీ నిర్వహించి కళాశాల ముందు ప్రదర్శన చేశారు. అనంతరం... డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితం గడుపుతామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ ప్రసన్న లక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ సీఎల్ చెన్నారెడ్డి, చంద్రికాబాయి, క్రిష్ణ కిషోర్, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



విరాళాన్ని అందజేస్తున్న మునివెంకటేశ్వర్లు

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): శ్రీవారి అన్నప్రసాదం ట్రస్టుకు బుధవారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. చెన్నైకు చెందిన బాలకృష్ణ సుకుమార్ ఈవిరాళాన్ని అందజేశారు. విరాళం డీడీని మునివెంకటేశ్వరు అనే ఉద్యోగి ద్వారా అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్రకుమార్‌కు అందజేశారు.

డ్రంక్ డ్రైవ్ కేసులో 15మందికి జరిమాన

తిరుపతి(లీగల్), జూన్ 26: డ్రంక్ డ్రైవ్ కేసులో 15మందికి కలిపి రూ.1.5లక్షలు జరిమాన విధిస్తూ 4వ అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు చేస్తూ వాహనదారులకు, నడిచివెళ్లేవారికి ఆటంకం కలిగించిన ఒక్కొక్కరికి రూ.200చొప్పున 23మందికి రూ.4600 జరిమాన విధించారు. ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ సూచనల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, చిన్నపెద్దయ్య, శ్రీరాములు, మహమ్మద్‌బాబాలు కేసు నమోదుచేశారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ గిరిబాబు కోర్టు ఆదేశాల మేరకు జరిమాన వసూలు చేశారు.

స్విమ్స్‌లో కాంట్రాక్టు పోస్టులకు ఇంటర్వ్యూలు

తిరుపతి(వైద్యం), జూన్ 26: స్విమ్స్ యూనివర్సిటీ న్యూరాలజీ విభాగంలో ఉన్న రెండు కాంట్రాక్టు పోస్టులకు జూలై 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కేటగిరిలో రీసెర్చ్ అసోసియేట్, పారామెడికల్ రెండు పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ రెండు పోస్టుల కాల వ్యవధి ఆరు నెలలు ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు జూలై 4న స్విమ్స్‌లోని కమిటీహాలులో నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకాగలరని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను చూడగలరని తెలిపారు.

కాట్రపల్లిలో అతిసారతో రెండేళ్ల బాలిక మృతి

కేవీబీపురం, జూన్ 26: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో దుశ్యంత్, కామాక్షి దంపతుల కుమార్తె దర్శిని(2) అతిసారతో మృతిచెందింది. గత నాలుగు రోజులుగా గ్రామంలో అతిసార ప్రబలడంతో పలువురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బుధవారం దర్శిని మృతి చెందింది. బాలిక మృతి విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వెంటనే జిల్లా వైద్యాధికారి శ్రీహరిని, వైద్యాధికారి కుమార్‌ను గ్రామానికి పిలిపించి వైద్య సేవలపై ఆరా తీశారు. దర్శిని మృతదేహానికి నివాళులర్పించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి అతిసారను అరికట్టాలని ఆదేశించారు. బాధితులకు అవసరమైన మందులు, వసతులు వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, వైసీపీ నేతలు రాజేష్, కృష్ణయ్య తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

టెన్త్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీలో 70.81 శాతం ఉత్తీర్ణత

తిరుపతి(విద్య), జూన్ 26: పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 70.81 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో తిరుపతి జిల్లా 14వ స్థానంలో నిలిచింది. బాలికలు బాలురకన్నా 10.27 శాతం అధికంగా ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారు. మొత్తం 3100 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2195 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 1948 పరీక్ష రాయగా 1301 మంది ఉత్తీర్ణులయ్యారు. 1152 మంది బాలికలు పరీక్ష రాయగా 894 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 66.79 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలికలు 77.06 శాతం ఉత్తీర్ణత నమోదుచేసి బాలురకంటే 4.02 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. నేటినుంచి నాలుగు రోజుల్లోపు బీఎస్ఈఏపీ పోర్టల్లో మార్కుల జాబితాలు అందుబాటులో ఉంటాయని, అలాగే సంబంధిత హెడ్ మాస్టర్ స్కూల్ లాగిన్‌నుంచి మార్కుల జాబితాలు, షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు ప్రకటించారు.

రీకౌంటింగ్‌కు జూలై 1 గడువు

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు గురువారం నుంచి జూలై 1వ తేదీ అర్ధరాత్రి 11 గంటలలోపు విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మునుపటిలా ఆఫ్‌లైన్, మాన్యువల్ విధానంలో దరఖాస్తు చేసుకునే విధానాన్ని అధికారులు రద్దు చేశారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు సంబంధిత పాఠశాల హెడ్‌మాస్టర్‌ను కలిసి ఫీజు చెల్లించి దరఖాస్తును అభ్యర్థించాల్సి ఉంటుంది.

ఎస్వీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26: ఎస్వీయూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బి.చంద్రయ్య నియమితులయ్యారు. ఇప్పటి వరకూ రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ హుస్సేన్ తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన ప్రొఫెసర్ హుస్సేన్ టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రిజిస్ట్రార్ పదవి నుంచి వైదొలిగారు. యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బి.చంద్రయ్యను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య బాధ్యతలు స్వీకరించారు. నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు పి.కె.సుబ్రమణ్యం, ఎస్.సుబ్రమణ్యం, గుర్రంకొండ శ్రీధర్, రవిచంద్ర, ఎస్ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, తదితరులు అభినందించారు.

చిరుధాన్యాల పరిశోధనపై నేటినుంచి జాతీయ సదస్సు

తిరుపతిరూరల్, జూన్ 26: తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీవర్సిటీ ఆడిటోరియంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం(ఆర్ఏఆర్ఎస్) ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో అఖిల భారత చిరుధాన్యాల పరిశోధనా సదస్సు జరగనుంది. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ, భారతవ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్), జాతీయ చిరుధాన్యాల పరిశోధనాసంస్థ(ఐఐఎంఆర్)సంయుక్తంగా ఈసదస్సు నిర్వహిస్తున్నట్లు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి పేర్కొన్నారు.దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చిరుధాన్యాల పరిశోధనా ప్రగతి, విడుదల చేసిన కొత్త రకాలు, అభివృద్ధి పరచిన సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందని వివరించారు. అలాగే గతసంవత్సరం చిరుధాన్యాల పంటల్లో చేపట్టిన పరిశోధనలు, రాబోయే సంవత్సరంలో జాతీయస్థాయి పరిశోధనా కార్యాచరణపై చర్చిస్తారని తెలిపారు. ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ తిరుపతిలోని పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధనా స్థానంలో రాగిపై విస్తృత పరిశోధనలు చేపడుతున్నామని తెలిపారు.గురువారం మొదలయ్యే ప్రారంభ సదస్సుకు ముఖ్యఅతిధిగా ఐసీఏఆర్ డీడీజీ డాక్టర్ టీఆర్ శర్మ, గౌరవఅతిధిగా ఏడీజీ డాక్టర్ ఎస్‌కే ప్రధాన్, విశిష్ఠ అతిధిగా ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ వీసీ ప్రొఫెసర్ శారద జయలక్ష్మి దేవి, డీఆర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రథమ సప్లిమెంటరీలో 46శాతం ఉత్తీర్ణత

తిరుపతి(విద్య), జూన్ 26: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో తిరుపతి జిల్లా 45 శాతం ఉత్తీర్ణతను సాధించింది. ఇంటర్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష గతనెల 24వ తేదీన నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఇంటర్ విద్యామండలి ఈనెల 18వ తేదీన విడుదల చేసింది. కాగా బుధవారం ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయి. ఉత్తీర్ణతా శాతంలో మన జిల్లా రాష్ట్రంలో ఆరవ స్థానంలో నిలిచింది. జిల్లానుంచి జనరల్ విభాగంలో 8,256 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3,719 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.ఒకేషనల్ విభాగం నుంచి 438మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 239 మంది ఉత్తీర్ణులయ్యారు.ఈ పరీక్షలకు సంబంధించి షార్ట్ మార్క్స్ మెమో బీఐఈ పోర్టల్లో జూలై 1 నుంచి అందుబాటులో ఉంటుందని విద్యామండలి ప్రకటించింది.

రీ వెరిఫికేషన్‌కు అవకాశం

ప్రథమ సంవత్సరం విద్యార్థులకు రీ వెరిఫికేషన్ అవకాశం కల్పించారు. ఈనెల 28 నుంచి జూలై 4వ తేదీ లోపు విద్యార్థులు రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో సబ్జెక్టుకు రూ. 1000 చొప్పున రీ వెరిఫికేషన్ ఫీజు కట్టాల్సి ఉంటుంది.

టెన్త్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీలో 70.81 శాతం ఉత్తీర్ణత

తిరుపతి(విద్య), జూన్ 26: పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 70.81 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో తిరుపతి జిల్లా 14వ స్థానంలో నిలిచింది. బాలికలు బాలురకన్నా 10.27 శాతం అధికంగా ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేశారు. మొత్తం 3100 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2195 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 1948 పరీక్ష రాయగా 1301 మంది ఉత్తీర్ణులయ్యారు. 1152 మంది బాలికలు పరీక్ష రాయగా 894 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 66.79 శాతం ఉత్తీర్ణత సాధించగా బాలికలు 77.06 శాతం ఉత్తీర్ణత నమోదుచేసి బాలురకంటే 4.02 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. నేటినుంచి నాలుగు రోజుల్లోపు బీఎస్ఈఏపీ పోర్టల్లో మార్కుల జాబితాలు అందుబాటులో ఉంటాయని, అలాగే సంబంధిత హెడ్‌మాస్టర్ స్కూల్ లాగిన్‌నుంచి మార్కుల జాబితాలు, షార్ట్ మెమోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు ప్రకటించారు.

రీకౌంటింగ్‌కు జూలై 1 గడువు

రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు గురువారం నుంచి జూలై 1వ తేదీ అర్ధరాత్రి 11 గంటలలోపు విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మునుపటిలా ఆఫ్‌లైన్, మాన్యువల్ విధానంలో దరఖాస్తు చేసుకునే విధానాన్ని అధికారులు రద్దు చేశారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు సంబంధిత పాఠశాల హెడ్‌మాస్టర్‌ను కలిసి ఫీజు చెల్లించి దరఖాస్తును అభ్యర్థించాల్సి ఉంటుంది.

చిరుధాన్యాల పరిశోధనపై నేటినుంచి తిరుపతిలో జాతీయ సదస్సు

తిరుపతి రూరల్, జూన్ 26: తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీవర్సిటీ ఆడిటోరియంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం(ఆర్ఏఆర్ఎస్) ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో అఖిల భారత చిరుధాన్యాల పరిశోధనా సదస్సు జరగనుంది. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ, భారతవ్యవసాయ పరిశోధనామండలి(ఐసీఏఆర్), జాతీయ చిరుధాన్యాల పరిశోధనాసంస్థ(ఐఐఎంఆర్)సంయుక్తంగా ఈసదస్సు నిర్వహిస్తున్నట్లు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి పేర్కొన్నారు.దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చిరుధాన్యాల పరిశోధనా ప్రగతి, విడుదల చేసిన కొత్త రకాలు, అభివృద్ధి పరచిన సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై చర్చించడం జరుగుతుందని వివరించారు. అలాగే గతసంవత్సరం చిరుధాన్యాల పంటల్లో చేపట్టిన పరిశోధనలు, రాబోయే సంవత్సరంలో జాతీయ స్థాయి పరిశోధనా కార్యాచరణపై చర్చిస్తారని తెలిపారు. ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ తిరుపతిలోని పెరుమాళ్లపల్లె వ్యవసాయ పరిశోధనా స్థానంలో రాగిపై విస్తృత పరిశోధనలు చేపడుతున్నామని తెలిపారు.గురువారం మొదలయ్యే ప్రారంభ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఐసీఏఆర్ డీడీజీ డాక్టర్ టీఆర్ శర్మ, గౌరవఅతిథిగా ఏడీజీ డాక్టర్ ఎస్‌కే ప్రధాన్, విశిష్ట అతిథిగా ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ వీసీ ప్రొఫెసర్ శారద జయలక్ష్మి దేవి, డీఆర్ డాక్టర్ పీవీ సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఉజ్వల భవిష్యత్తు : విజయశ్రీ

ఓజిలి, జూన్ 26: విజన్ ఉన్న సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం మాచవరంలో బుధవారం జరిగిన విజయోత్సవ సభలో ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించే దిశగా నిరంతరం శ్రమించే అధినేత ఆధ్వర్యంలో సభ్యురాలిగా ఉండడం సంతృప్తినిస్తోందన్నారు. తనపై నమ్మకముంచిన నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులతో మమేకమై పని చేస్తానన్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

నాయుడుపేట, జూన్ 26: సూళ్లూరుపేట నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. బుధవారం అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీమందిరం పార్కు వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ఆగిపోయిన సమ్మర్ స్టోరేజీలు, టిడ్కో ఇళ్లు వంటి వాటిని పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫి తదితరులు ప్రసంగించారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టండి: కురుగొండ్ల

వెంకటగిరి, జూన్ 26: నియోజకవర్గంలో అధ్వానంగా వున్న రోడ్లను గుర్తించి ప్రతి పాదనలు సిద్ధం చేస్తే మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన తన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు అధ్వానపు రోడ్లపై ప్రయాణించలేక నరకం అంటే ఏమిటో చూశారన్నారు. గతంలో అడ్డగోలుగా మంజూరు చేసిన పనులను రద్దు చేయాలని, ప్రజలకు అవసరమైన పనులు గుర్తించాలన్నారు. నాణ్యత లేకుండా జరిగిన పనులపై విచారణ చేపట్టడమే కాకుండా స్వప్రయోజనాల కోసం పనులు చేసి ఉంటే రికవరీ చేయిస్తామన్నారు. తనకు పోలీస్ కాన్వాయ్ అవసరం లేదని, తన స్కూటర్‌పై తిరిగి సమస్యలు తెలుసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ అధికారులు, సీఐ సంఘమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వెంకటగిరి మండలంలోని పాలకొండ సత్రంలో పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్వరరావు, తెలుగుయువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, ఎంపీపీ తనూజా రెడ్డి పాల్గొన్నారు.

అత్యాచార బాధితురాలికి సునీల్ పరామర్శ

గూడూరు అర్బన్, జూన్ 26: గూడూరు మండలంలోని ఓ గ్రామంలో కొద్దిరోజుల క్రితం అత్యాచారానికి గురైన బాలిక కుటుంబాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పరామర్శించారు. రూ.లక్ష ఆర్థికసాయాన్ని అందించారు. గాంధీనగర్‌లో నూతనంగా నిర్మించిన విఘ్నేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే వెండి కిరీటాన్ని బహూకరించారు.స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా కిట్లను అందజేశారు.

చెరువులో అక్రమ నిర్మాణం పరిశీలన

సూళ్లూరుపేట, జూన్ 26: మండల పరిధిలోని కుదిరి చెరువు పోరంబోకులో అక్రమ కట్టడాలను బుధవారం అధికారులు పరిశీలించారు. కుదిరి చెరువులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తహసీల్దార్‌కు గ్రామస్థులు, రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై చెరువులో ఇంటి నిర్మాణం చేపడుతున్న వంకా రాజేశ్వరి అధికారులు, గ్రామస్థులు అడ్డుకుంటున్నారని హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో కోర్టు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా విచారణ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఇరిగేషన్ ఏఈ ఠాగూర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం పిటీషనర్, గ్రామస్థుల సమక్షంలో ఇల్లు నిర్మిస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. రికార్డులను పరిశీలించగా 2014లో కేసీయన్ గుంట పంచాయతీకి చెందిన వంకా రాజేశ్వరికి దేగలపాలెం సర్వే నెం.106లో ఇంటి నిర్మాణానికి అప్పటి అధికారులు పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చి ఉన్నారు. అక్కడ నిర్మించకుండా కుదిరి చెరువు పోరంబోకులోని సర్వే నెం.128లో నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు కోర్టుకు నివేదించనున్నారు.

విచ్చలవిడిగా డంపింగ్‌యార్డులు

ప్రమాదమని తెలిసినా ఇళ్ల మధ్యే ఏర్పాటు

తడ, జూన్ 26: పరిశ్రమల వ్యర్థాలను డంప్ చేసే యార్డులు తడలో అనధికారికంగా ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేశారు. వీటితో ప్రమాదమని తెలిసీ ఇళ్ల మధ్యే ఏర్పాటు చేసుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. తడ మండలం పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లతోపాటు సూళ్లూరుపేటలోని తారకేశ్వర టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటయ్యాయి. అయితే వ్యర్థాలను తరలించేందుకు ఆయా పరిశ్రమలు ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పగిస్తుంటారు. దీంతో ఈ వ్యర్థాల తరలింపు వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. దీంతో పలువురు అనధికారికంగా డంపింగ్‌యార్డులను నిర్వహిస్తున్నారు. ఒక్క తడ మండలంలోనే సుమారు 16 వరకు ఈ తరహా డంపింగ్‌యార్డ్‌లున్నాయి. వీటికి అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేవు. అగ్నికారక వ్యర్థాలు డంప్ చేయాలంటే సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. అయితే ఎవ్వరూ తీసుకున్న దాఖలాలు లేవు. ఈక్రమంలో ఈనెల 10న మాంబట్టు సెజ్‌లో ఇలాంటి డంపింగ్‌యార్డులోనే అగ్నిప్రమాదం జరగడం... 24 గంటలైనా మంటలు అదుపులోకి రాకపోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది.



పూడి, భీములవారిపాళెం వద్ద ఉన్న అనధికార డంపింగ్‌యార్డులు

కారూరుమిట్టలోని డంపింగ్‌యార్డ్‌లో ఈనెల 18న సాయంత్రం మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అదుపుచేశారు. పరిశ్రమల కొయ్య వ్యర్థాలు కొంతమేర కాలిపోయాయి. పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలకు మంటలు అంటుకోకుండా స్థానికులు చొరవ తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇకనైనా అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దీనిపై ఎస్ఐ నరసింహారావు వివరణ ఇస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డులపై చర్యలు తీసుకుంటామన్నారు.

కాట్రపల్లిలో అతిసారతో రెండేళ్ల బాలిక మృతి

కేవీబీపురం, జూన్ 26: మండలంలోని కాట్రపల్లి గ్రామంలో దుశ్యంత్, కామాక్షి దంపతుల కుమార్తె దర్శిని(2) అతిసారతో మృతిచెందింది. గత నాలుగు రోజులుగా గ్రామంలో అతిసార ప్రబలడంతో పలువురు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బుధవారం దర్శిని మృతి చెందింది. బాలిక మృతి విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం వెంటనే జిల్లా వైద్యాధికారి శ్రీహరిని, వైద్యాధికారి కుమార్‌ను గ్రామానికి పిలిపించి వైద్య సేవలపై ఆరా తీశారు. దర్శిని మృతదేహానికి నివాళులర్పించారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి అతిసారను అరికట్టాలని ఆదేశించారు. బాధితులకు అవసరమైన మందులు, వసతులు వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, వైసీపీ నేతలు రాజేష్, కృష్ణయ్య తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



చిన్నారికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ఎస్వీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 26: ఎస్వీయూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బి.చంద్రయ్య నియమితులయ్యారు. ఇప్పటి వరకూ రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ హుస్సేన్ తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన ప్రొఫెసర్ హుస్సేన్ టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రిజిస్ట్రార్ పదవి నుంచీ వైదొలిగారు. యూనివర్సిటీ జాయింట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న బి.చంద్రయ్యను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు వెలువడటంతో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా చంద్రయ్య బాధ్యతలు స్వీకరించారు. నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు పి.కె.సుబ్రమణ్యం, ఎన్.సుబ్రమణ్యం, గుర్రంకొండ శ్రీధర్, రవిచంద్ర, ఎన్ఎంఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, తదితరులు అభినందించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు నడుం బిగిద్దాం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 26: మాదకద్రవ్యాల వ్యతిరేక సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం నగరంలోని ఎస్పీ కార్యాలయం నుంచి విద్యార్థులు, పోలీసులు, సెబ్ అధికారులు కలసి జిల్లా సెబ్ ఆధ్వర్యంలో బాలాజీ కాలనీ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఇన్‌చార్జి కలెక్టర్‌తో పాటు ఎస్పీ హర్షవర్ధనరాజు, కమిషనర్ అదితిసింగ్, సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానకిరాంలు జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకాన్ని అరికట్టడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని కోరారు. యువతీ, యువకులు డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు మాట్లాడుతూ మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. డ్రగ్స్‌ను నాశనం చేసేందుకే ఈ ర్యాలీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేసినా, సేవించినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ర్యాలీలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఎస్పీలు వెంకట్రావు, విమలకుమారి, సెబ్ ఈఎస్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఈఎస్ జానకిరాం, డీఎస్పీలు రవిమనోహరాచ్చారి, రమణకుమార్, వెస్ట్ సీఐ జయనాయక్, యూనివర్సిటీ సీఐ మురళీమోహన్‌రావు, సెబ్ తిరుపతి సీఐ సుబ్బారెడ్డి, ట్రాఫిక్ సీఐలు, వివిధ కళాశాలల విద్యార్థులు, పీఆర్‌ఓ నాగరాజు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కమిషనర్ అదితిసింగ్, విద్యార్థులు →



- మాటల్లో స్పష్టత.. సంకల్పంలో ధీరత
- కేడర్‌కు దిశానిర్దేశం
- అధికార యంత్రాంగానికి అభివృద్ధి ఆదేశం
- ప్రజలకు బంగారు భవిష్యత్తు సందేశం
- సరికొత్త చంద్రబాబును చూస్తారని హామీ
- ముగిసిన రెండు రోజుల కుప్పం పర్యటన

అప్డేట్ 'బాబు'



నా మాట వినండి. చెప్పింది చేయండి. మీ భవిష్యత్తు బంగారుమయం చేసే పూచీ నాది.
- ఐదేళ్ల వైసీపీ విధ్వంసంలో ప్రజలు ఎందుకూ కాకుండా పోయారన్న ఆవేదన.

'షో చేయడంవల్లే ఇంత దీనస్థితి. నేను, ప్రజలు అంతా బాగనే ఉన్నాం. మీరే బాగలేదు. ఇక మీదట ఇలాంటి తీరు సహించేది లేదు.
- మెజారిటీ రావాల్సినంత రానందుకు ముఖ్య స్థానాల్లో ఉన్న పార్టీ కేడర్‌పై ఆగ్రహం.

ఐదేళ్లలో మీలో కొంతమంది అధికారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. ఇక అటువంటి ఆటలు చెల్లవు. సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకుని రండి.
- అధికార యంత్రాంగంపై అసహనంతోపాటు జరగాల్సిన అభివృద్ధిపై ఆదేశం.

అవును.. 'బాబు' అప్డేట్ అయ్యారు. ఆ మాట ఆయనే స్వయంగా అన్నారు. 'పాత రాజకీయం ఇక పనిచేయదు. ఆ రాజకీయాలను మార్చాలి. నేను కూడా మారాలి. మారతాను' అని పార్టీ శ్రేణుల సమావేశంలో స్పష్టం చేశారు. ఆయన మారిన తీరుకు కుప్పం నియోజకవర్గంలో మంగళ, బుధవారాల్లో జరిగిన పర్యటనే తక్షణ నిదర్శనం. - కుప్పం

టైమ్ ప్రకారం షెడ్యూల్

అన్నింటికంటే అందరినీ ఆశ్చర్యం కలిగించిన సంఘటన.. రెండు రోజుల చంద్రబాబు పర్యటన షెడ్యూల్ టైమ్ ప్రకారం సాగడం. మంగళవారం ఉదయం షెడ్యూల్ సమయం కంటే కేవలం అరగంట ఆలస్యంగా పీఈఎస్ హెలిప్యాడ్‌కు చేరుకున్న ఆయన, బుధవారం సాయంత్రం చెప్పిన సమయమైన సాయంత్రం 4.10 గంటలకు అదే హెలిప్యాడ్‌నుంచి వీడ్కోలు తీసుకున్నారు. చెప్పిన షెడ్యూల్ మించి, ఒక్కటంటే ఒక్క ఇతర సమావేశాల్లో పాల్గొనడం కానీ, ముందుగా ప్రకటించని ప్రాంతాలకు వెళ్లడం కానీ చేయలేదు. దీంతో ఇటు పార్టీ కేడర్‌తోపాటు అటు అధికార యంత్రాంగం కూడా పూర్తిగా ఖుషీ అయింది.

జన నీరాజనం

నాలుగోసారి ముఖ్యమంత్రిగా అధికార పీఠం అధిష్ఠించిన తర్వాత తొలిసారిగా సొంత నియోజకవర్గంలో అడుగు పెట్టిన చంద్రబాబుకు ప్రజానీకం బ్రహ్మరథం పట్టింది. నిజానికి ఆయన శైలికి భిన్నంగా బస్సు దిగి కిందికి రాకపోయినా, దారి పొడవునా గజమాలలు, పూల వర్షాలతో సత్కరించి తమ గుండెల్లోని అభిమానం చాటుకుంది. మహిళలు మంగళ హారతులిచ్చి దిష్టి తీశారు. చిరునవ్వులతో తమ ఆనందాతిరేకాలను ప్రదర్శించారు. ఇటు ఆర్టీసీ బస్టాండులో జరిగిన సభలో జనం కానీ, ఇటు పార్టీ సమావేశాల్లో కేడర్ కానీ చంద్రబాబు ప్రసంగానికి ఈలలు, కేకలు వేస్తూ ఆయనలో వచ్చిన మార్పుపట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

అభివృద్ధే ఏకైక లక్ష్యంగా..

ముఖ్యమంత్రిగా తొలిసారి కుప్పం పర్యటనకు వచ్చిన చంద్రబాబు బుధవారం అధికార యంత్రాంగంతో సుదీర్ఘ సమీక్ష జరిపిన తీరు ఆయనలో వచ్చిన మార్పునకు సంకేతం. మంగళవారం కుప్పం సభలో ప్రజలకు హామీ ఇచ్చిన ప్రతి అభివృద్ధి పని గురించీ చంద్రబాబు సమీక్ష చేశారు. గత పాలనకు, తన పాలనకూ మధ్య మార్పు స్పష్టంగా కనిపించి తీరాలన్నారు. ప్రతి శాఖకు సంబంధించి స్పష్టమైన సమగ్రాభివృద్ధి ప్రణాళికలతో సాధ్యమైనంత త్వరలో తన దగ్గరకు రావాలని ఆదేశించారు. ప్రత్యేకించి నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టి పెట్టారు. గతంలో కంటే ఇది భిన్నమైన తీరు. ఇక్కడికిక్కడే స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం, అధికార యంత్రాంగంలోనూ చురుకుదనం పుట్టించే చర్య. ఇది చంద్రబాబుపై ప్రజల్లో పూర్తిస్థాయిలో నమ్మకం ఏర్పడడానికి దోహదం చేస్తుంది కూడా.

బంగారు భవిత

హంద్రీ-నీవా కాలువ పెండింగు పనులు పూర్తి, అవుటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం, కోల్డ్ స్టోరేజీ, ఆర్ అండ్ బీ భవనం పూర్తి, ఇన్నాళ్లూ మూలన పడ్డ వ్యవసాయ, పట్టు, పాడి, టెక్స్‌టైల్స్ పరిశ్రమల అభివృద్ధికి ప్రణాళికలు, మండల కేంద్రాల అభివృద్ధికి ఒక్కోదానికీ రూ.10 కోట్లు, పంచాయతీల అభివృద్ధికి రూ.కోటి నుంచి రూ.2 కోట్లు, అదనంగా రాళ్లబూదుగూరు, మల్లానూరును మండలాలు చేయడం.. ఇలా నియోజకవర్గ ప్రజలపైన వరాల జల్లు కురిపించారు. 'నేను మీ బాగు కోరే వాడిని. ఇంతకుముందు ఎంతో చేశాను. ఇకమీదటా చేస్తాను. కానీ మీరు కేవలం 48 వేల మెజారిటీ ఇచ్చారు' అని ఆవేదనా వ్యక్తం చేశారు. అలాగని అభివృద్ధి ఆగదని, వచ్చే ఐదేళ్లలో కుప్పాన్ని మోడల్ నియోజకవర్గంగా చేస్తానని హామీ ఇచ్చారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి బారులు తీరిన జనం

హెచ్చరించి.. బుజ్జగించి

పార్టీ కేడర్‌తోనూ చంద్రబాబు సమావేశాలు వినూత్న రీతిలో సాగాయి. మంగళవారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం... బుధవారం మధ్యాహ్నం జరిగిన వివిధ స్థాయిలలోని బూత్ స్థాయిదాకా ఉన్న కమిటీలు, ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలోనూ ఇది కనిపించింది. ఎన్నికల్లో తన మెజారిటీ ఏమాత్రం పెరగకపోవడంపైనే చంద్రబాబు పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించారు. ఎక్కడెక్కడో అత్యధికంగా మెజారిటీలు వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, స్వయంగా తన సొంత నియోజకవర్గంలో ఎందుకు రాబట్టలేకపోయారని, పార్టీ కేడర్ సమావేశంలో బాధ్యులను నిలదీశారు. గతంలో నలుగురైదుగురు సీనియర్లను మాత్రమే చేరదీసి వారు చెప్పిన విషయాలే ఆలకించి వెళ్లిపోయే బాబు, ఈసారి మాత్రం ఎన్నికల్లో ఏమాత్రం ఉపయోగపడలేకపోయిన అటువంటి కోటరీని పూర్తిగా పక్కన పెట్టారు. పైగా పిలవనిదే స్టేజీ ఎక్కి షో చేస్తున్నారంటూ మండిపడి, కిందిస్థాయి కార్యకర్తలు, యువ కేడర్‌లో హుషారు పుట్టించారు. కష్టపడేవారి భవిష్యత్తుకు ఢోకా లేదని చాలా స్పష్టంగా చెప్పడమే కాకుండా, కేవలం సీనియారిటీ ఇకమీదట పనిచేయదని, షో చేసేవాళ్లను ప్రోత్సహించేది లేదని కేడర్‌కు స్పష్టంగా తెలియజెప్పగలిగారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

శాస్త్రోక్తంగా సామూహిక అక్షరాభ్యాసం



పిల్లల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, జూన్ 26: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో బుధవారం ఉదయం సామూహిక అక్షరాభ్యాసం శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా ఆలయ పండితులు మేధా దక్షిణామూర్తి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం కలశ స్థాపనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు పిల్లలకు అవసరమైన పలక ఇతర సామగ్రి పంపిణీ చేశారు. ఆ తర్వాత గురువు సన్నిధిలో అర్చకుల వేదమంత్రాల నడుమ శుభముహూర్తాన పిల్లల చేత అక్షరాలు దిద్దించి అక్షరాభ్యాసం జరిపించారు. కార్యక్రమంలో ఈవో నాగేశ్వరరావు, అనువంశిక ప్రధాన అర్చకులు డాక్టర్ స్వామినాథన్ గురుకుల్, వేద పండితులు అర్ధగిరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం



ఉపకరణాలు అందజేస్తున్న ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య

శ్రీకాళహస్తి, జూన్ 26: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దాతల సహకారం ఆవశ్యకమని ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య అన్నారు. శ్రీకాళహస్తి మండలం పెద్దమిట్ట కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్థానిక దాత శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎంఈవోలు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు తదితర విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలే ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. అటువంటి విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకారం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ మురుగారెడ్డి, ఉపాధ్యాయులు హరినాథ్ అబ్దుల్ హమీద్, సీఆర్పీ హేమలత, గ్రామ పెద్దలు బాషాజీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ, స్కౌట్స్ అండ్ గైడ్స్

తొట్టంబేడు జూన్ 26: తప్పిపోయిన బాలుడిని కుటుంబసభ్యులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ క్షేమంగా అప్పగించారు. శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐ నరసింహరావు కథనం మేరకు... తిరుపతికి చెందిన సుబ్బరాజు బుధవారం ఉదయం కుమారుడు యోగేష్(5)తో పాటు బజారుకు వెళ్లాడు. ఈ క్రమంలో బస్టాండ్ ఆవరణలో యోగేష్ తప్పిపోయాడు. బస్సు ఎక్కి నాగలాపురం వెళ్లిపోయాడు. అక్కడ ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని అయ్యప్ప అనే వ్యక్తి గమనించిన శ్రీకాళహస్తిలోని స్కౌట్స్ మాస్టర్ సుబ్రహ్మణ్యంకు అప్పగించారు. స్కౌట్ ఛైర్మన్ షేక్ అజారుద్దీన్, స్థానిక స్కౌట్స్ వలంటరీలు, ఆశా వర్కర్లు అన్ని గ్రూపుల్లో వైరల్ చేశారు. విషయం తెలిసి తల్లిదండ్రులు శ్రీకాళహస్తికి చేరుకున్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కమీషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో సీఐ నరసింహారావు సమక్షంలో చిన్నారిని తండ్రి సుబ్బరాజుకు అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ ఛైర్మన్ అజారుద్దీన్, స్కౌట్స్ మాస్టర్లు ఉప్పు సుబ్రహ్మణ్యం, అయ్యప్ప, కేశవులు, ఆశ వర్కరు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

యానాదివెట్టులో పార్శిల్ కలకలం

వరదయ్యపాళెం, జూన్ 26: వరదయ్యపాళెం మండలం యానాదివెట్టులో ఓ అనుమానాస్పద పార్శిల్ కలకలం రేపింది. గ్రామంలోని పంట కాలువ తూము వద్ద పొదల్లో పార్శిల్ మూటను స్థానికులు కనుగొన్నారు. దుర్వాసన వస్తుండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఏఎస్ఐ షణ్ముగం, సెక్రటరీ రాజేశ్వరి, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పొదల్లో ఉన్న పార్శిల్‌ను పరిశీలించారు. ఆ మూటలో మృతిచెందిన కుక్క కళేబరం ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు.

డయేరియా నిర్మూలనకు చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 26: మండలంలో డయేరియా నిర్మూలనకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎంపీడీవో, త్రివిక్రమ్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ చంద్ర బాబు నాయుడు, డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులు బుధవారం బీఎన్‌కండ్రిగ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులు తాగుతున్న మినరల్ వాటర్‌ను పరీక్షించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు సంపు ద్వారా అందిస్తున్న తాగునీటిని పరిశీలించి పరీక్షించారు. అలాగే వీఎస్‌పురంలో పర్యటించారు. అధ్వానంగా ఉన్న మురుగు కాలువలను శుభ్రం చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్య, ఈవోపీఆర్డీ రాజశేఖర్, సీడీపీవో దేవకుమారి, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

వరదయ్యపాళెం, జూన్ 26: డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఉదయభారతి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆమె వరదయ్యపాళెం, గోవర్ధన పురం, ఇందిరానగర్, కురుంజలం, అయ్యవారిపాళెం, సీఎల్ ఎన్‌పల్లి పాఠశాలలను తనిఖీ చేశారు.

పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా బాలసుబ్రహ్మణ్యం రెడ్డి

రేణిగుంట, జూన్ 26: రేణిగుంట పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా బాలసుబ్రహ్మణ్యం రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రేణిగుంట పంచాయతీ కార్యదర్శిగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న రవిశంకర్ రెడ్డి రిలీవ్ కావడంతో వెంకటాపురం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న బాలసుబ్రహ్మణ్యంరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎంపీడీవో విష్ణు చిరంజీవి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

గంగజాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

కేవీబీపురం, జూన్ 26: మండలంలోని ఆరై గ్రామంలో బుధవారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. టీఎన్‌టీయూసీ తిరుపతి పార్లమెంటు సభ్యుడు జయరామిరెడ్డి ఎమ్మెల్యేని పూలమాలలు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రామాంజుల నాయుడు, గోపీనాథరెడ్డి, లక్ష్మీపతిరాజు, మునస్వామియాదవ్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

తొట్టంబేడు జూన్ 26: తొట్టంబేడు మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈ బాలాజీ తెలిపారు. బుధవారం కన్నలి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మీటర్ల మరమ్మతులు, విద్యుత్ లైన్లు, అధిక బిల్లులు, మీటర్ల మార్పు తదితర సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 27వ తేదీన బోనుపల్లి, 28న కొనతనేరి, 29న చియ్యవరం సబ్‌స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఏఈ తెలిపారు.

వైభవంగా గంగజాతర

పిచ్చాటూరు, జూన్ 26: మండల కేంద్రమైన పిచ్చాటూరులో గంగజాతర బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. అమ్మవారి భక్తులు ఒళ్లంతా నిమ్మ పండ్లు కుట్టుకుని మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగారు. భక్తులు గండు దీపం దర్శించుకుని అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు నిర్వహించిన నాట్య విన్యాసాలు చూపర్లను కట్టిపడేశాయి. రాత్రి పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించిన అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు.

అచేతనావస్థలో పోలీసుశాఖ

- నిర్వీర్యమైపోయిన పలు విభాగాలు
- పూర్వ వైభవంపై ప్రజల ఆశలు

శ్రీకాళహస్తి, జూన్ 26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలో పోలీసుశాఖ అచేతనావస్థకు చేరుకుంది. 2014 నుంచి 2109 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వం పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చింది. ప్రజారక్షణే లక్ష్యంగా పోలీసుశాఖ సేవలను ప్రజలకు ఎంతగానో చేరువ చేసింది. అయితే గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ ధోరణితో ఆయా విభాగాలన్నీ నిర్వీర్యమయ్యాయి. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పోలీసు శాఖకు పూర్వ వైభవం వస్తుందని ప్రజలు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు.

అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్



ఆర్టీసీ కూడలి వద్ద పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ సమస్య ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం 2018లో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. అప్పటి డీఎస్పీ వెంకట కిషోర్ ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. సూపర్ బజార్, పెళ్లి మండపం, ఆర్టీసీ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఏడాది తర్వాత ప్రభుత్వం మారడంతో వాటిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ నిరుపయోగంగా ఉంది. ప్రస్తుత పాలకులు, అధికారులు దీనిపై దృష్టి సాధించాల్సి ఉంది.

షీ టీం మాయం

ఆకతాయిల ఆట కట్టించేందుకు తగ టీడీపీ ప్రభుత్వ హయాంలో షీ టీం బృందాలను నియమించారు. ఇందుకోసం కొందరు మహిళా పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో నియమించారు. పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో, విద్యాసంస్థల వద్ద ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్టవేయడంతో రోడ్లపై ఆడపిల్లలకు స్వేచ్ఛ లభించింది. మహిళలు ఎక్కడైనా ఆపదలో ఉన్నట్లు ఫిర్యాదు వస్తే వెంటనే షీ టీం ప్రత్యక్షమయ్యేది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత షీ టీం బృందాలే లేకుండా పోయాయి.

క్రైమ్ స్పాట్ బృందాలు ఎక్కడ?

పోలీస్ శాఖలో గతంలో క్రైమ్ స్పాట్ పేరుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎక్కడ చోరీలు, నేరాలు జరిగినా క్రైమ్ స్పాట్ బృందం చేరుకునేది. నిందితుల కోసం ముమ్మరంగా వేట సాగించేవారు. ప్రస్తుతం ఈ బృందాలు కనిపించడం లేదు. అలాగే ప్రతి పోలీస్ స్టేషన్లో ఐడీ పార్టీ పేరుతో కానిస్టేబుళ్లను నియమించేవారు. నేర దర్యాప్తు, చోరీ జరిగిన వస్తువుల రికవరీ కోసం వీరు ప్రత్యేకంగా పనిచేసేవారు. సెల్ ఫోన్లు చోరీ, ఇళ్లలో దొంగతనాలు జరిగితే వీరు చురుగ్గా పనిచేస్తూ ఛేదించేవారు. ప్రస్తుతం అలాంటి వ్యవస్థలు సక్రమంగా పనిచేయడం లేదు.

నిద్రావస్థలో నిఘా వ్యవస్థ



పనిచేయని సీసీ కెమెరాలు

పోలీస్‌శాఖలో నిఘా వ్యవస్థ నిద్రావస్థలోకి వెళ్లిపోయింది. శ్రీకాళహస్తి ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. పట్టణ వ్యాప్తంగా కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటన్నింటినీ ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పట్టణంలో ఏ మూల ఏం జరిగినా పోలీసులు వెంటనే పసిగట్టేవారు. ప్రజలు ఆటోల్లో ప్రయాణిస్తూ ఏదైనా వస్తువులు, బ్యాగులు మర్చిపోయినా వెంటనే కనుగొని బాధితులకు అప్పగించేవారు. ఎవరైనా అదృశ్యమైతే కెమెరాల ఆధారంగా వెంటనే గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించేవారు. చాలా నేరాల్లో కమాండ్ కంట్రోల్ విధానంతో కేసులను సునాయాసంగా ఛేదించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కెమెరాల పర్యవేక్షణ పూర్తిగా గాలికొదిలేశారు. ప్రస్తుతం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఒక్క కెమెరా కూడా పనిచేయని దుస్థితి నెలకొంది.

ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ఏమైంది?



ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్

వన్ టౌన్ పోలీస్‌స్టేషన్లో 2017లో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. అప్పటి తిరుపతి అర్బన్ ఎస్పీ జయలక్ష్మి ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. దంపతులు, కుటుంబ కలహాల బాధితులు తమ సమస్యల కోసం తిరుపతిలోని మహిళా పోలీస్ స్టేషనుకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే కౌన్సెలింగ్ అందించేవారు. మంచి ఫలితాలు రావడంతో పెద్దఎత్తున ప్రశంసలు వచ్చాయి. కానీ, వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను పూర్తిగా ఎత్తేశారు. ఆ భవనంలో పోలీస్ క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ప్రజల్లో భావోద్వేగాల నియంత్రణకు, కుటుంబ వ్యవస్థ బలోపేతానికి ఫ్యామిలీ కౌన్సెలింగ్ చాలా అవసరం.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ



విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, జూన్ 26: విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం నాగలాపురంలోని వ్యాపార సంఘం కల్యాణ మండపంలో ఎంఈవో బాబయ్య ఆధ్వర్యంలో స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ శ్రద్ధతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పుత్తూరు డీవైఈవో ప్రభాకర్ రాజు, తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీవో బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, పార్థిబన్, ఎస్ఎం. సురేష్, మురళి, అన్బు, వెంకటేష్, ఛాన్‌బాషా, ప్రణీత్, డాక్టర్ శేషాద్రి, రాజారాం, బాలాజీ, మురళీ నాయుడు, రుద్రయ్య నాయుడు, మనోజ్ నాయుడు, హరిరెడ్డి, నరేంద్రరెడ్డి, యమున, నెల్సన్ మండేలా, భాస్కర్‌బాబు, ఉమాశంకర్, రాజవేలు, శామ్యూవేల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం

కేవీబీపురం, జూన్ 26: మండలంలోని ఎస్ఎల్ పురంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం బుధవారం పునః ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీలతో మాట్లాడుతూ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటిసారి మండల పర్యటనకు వచ్చిన ఆదిమూలం ఎగువపుత్తూరులో సీనియర్ నాయకుడు నాగరాజునాయుడు ఆధ్వర్యంలో దళితవాడలో ఏర్పాటు చేసిన టీడీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజులు నాయుడు, గోపినాథరెడ్డి, లక్ష్మీపతిరాజు, మునస్వామి యాదవ్, సురేష్‌చౌదరి, వరలక్ష్మి, పావని, బాలాజీ, మణి, మేస్త్రీ వెంకటేష్, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



ట్రైనీ ఐఏఎస్‌లకు శ్రీసిటీ గురించి వివరిస్తున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, జూన్ 26: ఏపీ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా 2023 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. పారిశ్రామికాభివృద్ధి, సుస్థిర పర్యావరణ వ్యవస్థ, సామాజిక బాధ్యతను సమన్వయం చేయడం ద్వారా ప్రపంచ స్థాయి వ్యాపార గమ్యస్థానంగా శ్రీసిటీ మారిందని తెలిపారు. స్థానిక ప్రజల ప్రమేయంతో ఈ ప్రాంత వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను పారిశ్రామిక శక్తి కేంద్రంగా శ్రీసిటీ ఎలా విజయవంతంగా మార్చిందో వివరించారు. శ్రీసిటీ చక్కని ప్రణాళిక అమలు, సుస్థిర పట్టణీకరణ సూత్రాలను ట్రైనీ ఐఏఎస్ బృందం ప్రశంసించింది. తమ పర్యటనకు సహకరించిన శ్రీసిటీ ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు.

దుప్పిని వేటాడిన నిందితుల అరెస్టు



వేటగాళ్లతో అటవీశాఖ అధికారులు

వరదయ్యపాళెం, జూన్ 26: మండలంలోని వెంగారెడ్డి చెరువు వద్ద అటవీశాఖ అధికారులు చేపట్టిన దాడుల్లో దుప్పిని వేటాడిన నిందితులను అరెస్టు చేసినట్లు అటవీ సెక్షన్ అధికారి దేవరాజులు తెలిపారు. బుధవారం కడూరు బీట్ పరిధిలో అటవీ జంతువులను వేటాడుతున్నారని అందిన సమాచారం మేరకు ఎఫ్ఎస్‌వో దేవరాజులు ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. వెంగారెడ్డి చెరువు వద్ద చంపబడిన చుక్కల దుప్పితో పాటు మండలంలోని చిన్నపాండూరు నక్కలమిట్టకు చెందిన రాజావెంకట్ అలియాస్ శరత్ కుమార్, సత్యవేడు మండలం మాదనపాళెం గ్రామానికి చెందిన రామకృష్ణను అదుపులో తీసుకుని అటవీ జంతు సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. వారి నుంచి ఒక నాటు తుపాకి, మందుగుండు సామగ్రి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరచినట్లు దేవరాజులు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు చెంగల్రాయ నాయుడు, మస్తాన్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గ్రామాన్నే రికార్డుల్లో మార్చేస్తారా?

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎనమలపాలెం అరుంధతివాడవాసుల ఆందోళన



రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఎం నేతలు, బాధితుల నిరసన

వడమాలపేట, జూన్ 26: కాసులకు కక్కుర్తిపడి ఎలాంటి ఆధారాలు లేకుండా గ్రామాన్నే రికార్డుల్లో మార్పుచేసి భూములను ధారాదత్తం చేసినా తహసీల్దార్‌పై చర్యలు తీసుకునేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని ఎనమలపాలెం అరుంధతివాడ వాసులు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఎనమలపాలెం అరుంధతి వాడ వాసులు నిరసన తెలిపారు. తిరుమణ్యం రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 195-3లో 5.12 ఎకరాలను రికార్డులు తారుమారు చేసి అక్రమార్కులకు కట్టబెట్టడం దారుణమని ఆరోపించారు. 1975 నుంచి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, అదే స్థలంలో పాఠశాల కూడా ఉందన్నారు. తహసీల్దార్ రాజసింహ నరేంద్ర ఎలాంటి ఆధారాలు లేకుండానే 5.12 ఎకరాల భూమి చెంగయ్య పేరుమీద అడంగల్‌లో మార్పు చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1బీ, అడంగల్‌లో మార్పు చేయకుంటే ఆందోళన నిరంతరాయంగా కొనసాగిస్తామని సీపీఎం నాయకులు వెంకటేష్ హెచ్చరించారు. పుత్తూరు సీఐ భాస్కర్ నాయక్, వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి, ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడి రేపు కలెక్టర్ కార్యాలయానికి వెళ్తే సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో నిరసన విరమించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

పుత్తూరు టౌన్, జూన్ 26: పుత్తూరు కోర్టు ఆవరణలో ఈ నెల 29వ తేదీన జరగనున్న లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్సీ రాఘవేంద్ర కోరారు. బుధవారం స్థానిక సబ్ కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం, న్యాయవాదులు పాల్గొన్నారు.

సారూ... గాడిన పెట్టాలి మీరు

నేటి మున్సిపల్ మీట్‌కు హాజరు కానున్న ఎమ్మెల్యే భానుప్రకాష్



కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు (ఫైల్‌ఫొటో)

పుత్తూరు అర్బన్, జూన్ 26: ప్రజా అవసరాలు ఒకవైపు, ప్రజా ప్రతినిధుల పనితీరు మరోవైపు ఉంటే అందుకు అధికార పక్షం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందనేందుకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఎదురయిన పరాభవమే నిదర్శనం. ఏకపక్ష విజయంతో మున్సిపాలిటీని కైవసం చేసుకున్న వైసీపీ పాలకమండలి సాగించిన అధ్వానపు పనితీరుతో పట్టణంలో అభివృద్ధి మందగించింది. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన కౌన్సిలర్లు ఉత్సవమూర్తులుగా మిగిలిపోయారు. అధికార యంత్రాంగంలో నిష్క్రియాపరత్వం కూడుగట్టుకుపోయింది. గురువారం నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశానికి తొలిసారి ఎమ్మెల్యే హోదాలో గాలి భానుప్రకాష్ హాజరుకానున్నారు. పట్టుతప్పిన మున్సిపల్ పాలన గాడిన పెట్టాలని ఎమ్మెల్యే భాను వైపు పట్టణవాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పట్టణంలో మందగించిన అభివృద్ధి

వైసీపీ పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప అభివృద్ధి శూన్యమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిధులు ఉన్నప్పటికీ మున్సిపల్ భవనాన్ని నిర్మించేందుకు ఐదేళ్లు ముక్కి మూలిగి ఒక అంతస్తును పూర్తి చేసి మరో అంతస్తును సగంలో వదిలేశారు. కేఎన్ రోడ్డు, మెయిన్ రోడ్డులో డ్రైనేజీల నిర్మాణం ఐదేళ్లుగా సాగుతూ....నే ఉంది. పట్టణ ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చేందుకు ఉద్దేశించిన తెలుగు గంగ పైప్‌లైన్ ప్రాజెక్టు కేవీబీ పురం దాటలేదు. చెర్లోపల్లి రోడ్డు పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. పట్టణ శివారు ప్రాంతాల్లో వీధిదీపాలకు కూడా దిక్కులేకుండా పోయిందని పట్టణవాసులు గగ్గోలుపెడుతున్నారు. వైసీపీ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో జరిగిన అరాకొరా పనులు తప్ప మున్సిపల్ పరిధిలో జరిగిన అభివృద్ధి మేడిపండు చందాన ఉందనే మాటలు వినబడుతున్నాయి.

ఉత్సవ విగ్రహాలుగా కౌన్సిలర్లు

మొత్తం 27 వార్డులకు గాను 22 స్థానాల్లో వైసీపీ కౌన్సిలర్లు విజయం సాధించారు. తమ సమస్యలను కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించి పరిష్కార మార్గాలు చూపుతారని ఆశించిన పట్టణవాసులకు నిరాశే ఎదురయ్యింది. సమావేశానికి కోరం కోసం తప్ప ఏ రోజు ప్రజా సమస్యలను ప్రస్తావించి పాపాన పోలేదని వైసీపీ కౌన్సిలర్లను పట్టణవాసులు ఈసడించుకుంటున్నారు. దీనికి తోడు సమస్యలను ప్రస్తావించిన టీడీపీ కౌన్సిలర్లను అసభ్య పదజాలంతో దూషించడం, సంబంధంలేని అప్పటి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్‌ను తూలనాడడానికి వైసీపీ కౌన్సిలర్లు పోటీలు పడ్డారు. సమావేశంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు వారి నాయకురాలు రోజాకు భజన చేయడానికే మూడేళ్ల విలువైన కాలాన్ని కరగదీశారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిష్క్రియాపరత్వంలో యంత్రాంగం

యథారాజా తథాప్రజా అనే చందాన పాలకులకు తోడు అధికార యంత్రాంగం ప్రజాసమస్యల పరిష్కారంలో ఘోరంగా విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. పట్టణంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఏడాదిగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీగానే ఉంది. ఇటీవల నందిమంగళంలో అతిసార ప్రబలి ఇద్దరిని బలిగొంది. టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతిలో కూరుకుపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గృహ నిర్మాణాలకు అనుమతి కోసం వచ్చే దరఖాస్తుదారులను అంక్షల పేరుతో ఇబ్బందులకు గురిచేసి అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇంజరీంగ్ విభాగం పనితీరు కూడా అంతంత మాత్రంగానే ఉంది. బోర్లు రిపేర్లు పేరుతో మున్సిపాలిటీ నిధులు స్వాహా అవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని రకాల అవలక్షణాలతో కునారిల్లుతున్న మున్సిపాలిటీని గాడిన పెడతారనే ఆశతో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వైపు పట్టణవాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. గురువారం నిర్వహించే మున్సిపల్ సమావేశంతో కార్యారంగంలోకి దిగుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

గంగమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, జూన్ 26: మండలంలోని వడమాల గ్రామంలో గంగజాతర సందర్భంగా బుధవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు గ్రామంలో ఇంటింటా కర్పూర నీరాజనాలు అందుకుంటూ బుధవారం ఉదయం కూడలికి చేరుకుంది. మొక్కుబడి కలిగిన భక్తులు వెయ్యి కళ్ల దుత్తల్లో నూనె దీపాలు వెలిగించి అమ్మవారికి మంగళ హారుతులిచ్చారు. సాయంత్రం అమ్మవారికి గ్రామస్తులు అంబళ్లు పోశారు. రాత్రి నిమజ్జనం చేశారు.